# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





## కుప్పానికి మళ్లీ 'గజరాజులు' వచ్చాయ్

- వేర్వేరు బృందాలుగా ఎనిమిది ఏనుగులు !!
- కంగుంది .. పైపాళ్యం అటవీ ప్రాంతంలో తిష్ట !!

బంగానత్తం వద్ద వరిపంట ధ్వంసం.. దారి మళ్లింపుకు యత్నాలు !!



ఫైల్‌ఫోటో

కుప్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త

కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న కుప్పం మండలంలోకి మరలా గజరాజులు ప్రవేశించాయి. వేర్వేరు బృందాలుగా ఏనుగులు సంచరిస్తున్నాయి. ఓ బృందంలో ఐదు, మరో బృందంలో మూడు ఏనుగులు ఉన్నాయి. ఈ ఏనుగుల గుంపు తమిళనాడులోని కాళికోయిల్ అటవీ ప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చాయి. మూడు ఏనుగుల గుంపు మండలంలోని బంగానత్తం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి రైతులు సాగు చేస్తున్న వరి పంటను కొంత మేర ధ్వంసం చేశాయి. ఈ మూడు ఏనుగులు మండలంలోని కంగుంది రిజర్వ్ ఫారెస్ట్‌లోఉన్న నాయనూరు అటవీ ప్రాంతం దాటుకుని కంగుంది సమీపంలోని తిర్లావాని బండ గ్రామం వైపుకు మంగళవారం రాత్రికి వెళ్తున్నాయి. ఇదిలా ఉండగా మరో ఐదు ఏనుగుల గుంపు మండలంలోని పైపాళ్యం - చెక్కునత్తం అటవీ ప్రాంతంలో మకా ం పెట్టినట్లు అటవీ అధికారులు గుర్తించారు. దీంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. కుప్పం రేంజర్ జయశంకర్ అధ్వర్యంలో డిఆర్వో సమీర్ బాషా, బీట్ ఆఫీసర్లు, ట్రాకర్లు ఏనుగుల జాడను గుర్తిస్తూ వాటిని దారి మళ్లించే ప్రయత్నాల్లో ఉన్నారు. రెండు బృందాలుగా ఏనుగుల సంచారం ఉండడంతో అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వో జయశ ంకర్ కోరారు. రాత్రిపూట ఎవరూ బయటకు రావద్దని, పంట పొలాల వైపు వెళ్లరాదని సూచించారు. సాధ్యమైనంత త్వరగా ఏనుగులను దారి మళ్లించేలా చర్యలు చేపట్టామన్నారు.

## రాహుకేతుదోష నివారణ పూజల్లో 'రష్యావాసులు'

శ్రీకాళహస్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహిమాన్విత రాహుకేతు దోష నివారణ పూజలను మంగళవారం రష్యా దేశస్థులు జరిపించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రతి ఏటా రష్యావాసులు రావటం భక్తి శ్రద్ధలతో స్వామి అమ్మవార్లను దర్శించుకోవటం పూజలు జరపటం జరుగుతుంది. ఈ నేపథ్యంలో మంగళవారం 29 మంది రష్యాకు చెందిన యువతీ యువకులు ఎంతో చక్కగా భారతీయ సంప్రదాయం ఉట్టి పడేటట్లు కట్టుబొట్టుతో ఆలయానికి హాజరయ్యారు. 29మంది ఆలయంలోని రూ.500ల రాహుకేతుదోష నివారణ పూజల మండపంలో హాజరై పూజలు జరిపించుకున్నారు.

## టిటిడి విద్యాసంస్థల్లో డిజిటల్ తరగతి గదులు



- జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం
- తలకోన సిద్దేశ్వరస్వామి ఆలయానికి రూ.14.10కోట్లు
- పద్మావతి మహిళ డిగ్రీ కళాశాలలో అదనంగా 270 హాస్టల్ సీట్లు
- తిరుపతిలో రోడ్ల నిర్వహణ, మరమ్మతులు కొనసాగింపు

తిరుమల, డిసెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:

టిటిడి విద్యాసంస్థల్లో మరింత మెరుగైన విద్యాబోధన చేయడానికి ఎడ్యుకేషన్ సబ్‌కమిటీ నివేదిక ఆధారంగా 31 విద్యాసంస్థల్లో డిజిటల్ తరగతి గదులు నిర్వహణకు ధర్మకర్తలమండలి ఆమోదించింది. అవసరమైన సిసికెమెరాలు, కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్, తగినంతమంది సిబ్బంది తదితర సౌకర్యాలను కల్పించాలని నిర్ణయించింది. ప్రభుత్వ విద్యాసంస్థల తరహాలోనే టిటిడి ఆధ్వర్యంలోని ఎస్వీ జూనియర్ కళాశాల, పద్మావతి మహిళ జూనియర్ కళాశాలలో డేస్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం అన్నమయ్యభవనంలో టిటిడి ధర్మకర్తలమండలి సమావేశం చైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగింది. పలు కీలక అంశాలు చర్చించి ఆమోదించారు. తిరుపతిలో టిటిడి నిర్వహిస్తున్న రోడ్లు, మరమ్మతులు, వీధిదీపాల నిర్వహణ కొనసాగించాలని నిర్ణయించారు. తిరుపతి జిల్లా తలకోనలోని సిద్దేశ్వరస్వామి ఆలయ పున:నిర్మాణ పనుల్లో భాగంగా రెండవదశలో 14,10కోట్లు రూపాయలు మంజూరుచేశారు. ఇప్పటికే నాలుగు కోట్ల రూపాయలు మంజూరుచేశారు. తిరుపతిలోని పద్మావతి మహిళ డిగ్రీకళాశాలలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 2,100 హాస్టల్ సీట్లకు అదనంగా మరో 270 సీట్లు పెంచాలని నిర్ణయించారు. తిరుమలలో, కాలిబాటలో ఉన్న పురాతన ప్రాశస్త్యం గల నిర్మాణాల పరిరక్షణకు ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పాటు చేసి, అనుభవం గల అధికారుల నియామకానికి ఆమోదం. తిరుమలలో రహదారులు, ముఖ్యకూడళ్ళ పేర్లను వైష్ణవ పురాణాలు, ఆళ్వార్లు, అన్నమాచార్య సంకీర్తనల్లోని శ్రీవారి నామాలు వంటి పేర్లతో మార్చేందుకు కమిటీ ఏర్పాటు చేశారు. శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు అదనంగా 48కోట్ల రూపాయలు మంజూరు చేయడానికి ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ వీరబ్రహ్మాం, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జ్యోతులనెహ్రూ, శాంతారాం.నరేశ్, ఎంఎస్‌రాజు, నర్సిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, జానకీదేవి, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో వేధింపులు.. పోలీసు కేసులు

### అధికారంలోకి వచ్చాక మాట వినని అధికారులతో తిప్పలు తెలుగుతమ్ముళ్ళ అంతర్మధనం:



***ఐదేళ్ళ పాటు వైకాపా పాలనలో పడరాని ఇబ్బందులు పడ్డాము. పార్టీ పేరు చెబితే వేధింపులు తమ పార్టీలో చేరే వరకు సాధింపులు, మాట వినని వారిని ప్రశ్నించిన వారిపై బెయిల్ లేని పోలీసు కేసులు.పోరాటాలు చేసాము. కూటమి ప్రభుత్వాన్ని తెచ్చుకున్నాము.కానీ నేడు ఏం జరుగుతుంది.మాట వినని అధికారులు.రెవెన్యూ కార్యాలయంలో ఏ ఫైల్ కావాలన్నా రేట్లు.సబ్‌రిజిస్టర్ కార్యాలయాలకు వెళితే పర్సంటేజీలు. విద్యుత్‌శాఖకు వెళితే దడ పుట్టించే మామూళ్ళు. అధికార పార్టీ అయినా మాకేంటి? అనే విధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పరిస్థితి కొనసాగుతుంది.***

శ్రీకాళహస్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రెవెన్యూ, సబ్‌రిజిస్టర్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాలు వ్యాపార కేంద్రాలుగా వసూళ్ళ అ డ్డాలుగా మారాయని తెలుగుతమ్ముళ్ళే మదన పడుతున్నారు.ఇలా అయితే ఏం చేయాలనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏ కార్యాలయానికి వెళ్ళినా మాట వినని అధికారులు, తొట్టంబేడు రెవెన్యూ కార్యాలయంలో అయితే అధికారి తెలుగుదేశం తమ్ముళ్ళు అంటే కనీసం పరిగణలోకి తీసుకోవటం లేదని కుములు తున్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి కార్యకర్తలు ఎంతో కృషి చేసారని వారి త్యాగాలకు ఫలితం దక్కటం లేదని వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసు స్టేసన్లకు వెళితే కనీసం అధికారులు పట్టించుకోవటం లేదని తల్లడిల్లుతున్నారు. ఇక ఏదైనా పని గా వెళితే అన్ని సక్రమంగా ఉన్నా ఏదో వంక పెడుతున్నారని పని చేయటం లేదని వాపోతున్నారు. నాయకులకు అధికారం కార్యకర్తలకు ఆవమానాలు తప్పవా? ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల తీరు అధికార పార్టీ అంటే అంటరానివారుగా చూస్తున్నారని వారిని నడిపిస్తున్న అధృశ్యశక్తి ఎవరని ప్రశ్నించుకుంటున్నారు. వైకాపా హయాంలోనే పోరాటాలకు వెరవని కార్యకర్తలు తెలుగుదేశం వారు. ఇలా అవమానించే అధికారులపై పోరాటాలు చేయటం కష్టం కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాళహస్తి తహాశీల్దార్ కార్యాలయంలో పేరుకు పోతున్న స్పందన, ప్రజా దర్బార్ వినతులతో సామాన్యులు తిరగలేక పోతున్నారు.

ధరలు ఖరారు . . .

శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తి తొట్టంబేడు రెవెన్యూ, సబ్‌రిజిస్టార్ కార్యాలయాల్లో అనుభవ ధృవీకరణకు ఒక ధర, విద్యుత్ కనెక్షన్ పొందాలంటే ఒక ధర, సమస్యాత్మక ప్రాంతాలలో గస్తీ తిరగాలంటే దానికో పెద్ద సిఫారసు కావాలి! భూ హక్కుల రికార్డులు మార్చాలంటే పెద్ద పోరాటమే కాకుండా అధికారుల జేబులు నిండినట్లు సంతృప్తి పడితేనే పని. దురాక్రమణలను తొలగించటం తొట్టంబేడు లో పని చేసే అధికారులకు సాధ్యం కాదు.కారణం ఏదో లింకు.నేడు ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగుతమ్ముళ్ళు వెళితే పరిస్థితి నేల విడిచి సాము చేసినట్లే వ్యూరిందని వాపోతున్నారు. అయితే తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక తమలో తామే తిక మక పడుతున్నారు. వాస్తవ పరిస్థితి చెప్పినా నాయకులు వింటారా?అని అంతర్మధనంలో ఉన్నారు.

## జిల్లా 'దేశం' సారధి షణ్ముగరెడ్డి

### - చక్రం తిప్పిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

చిత్తూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త:



జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా నగరి నియోజకవర్గానికి చెందిన బీసీ నాయకులు షణ్ముగరెడ్డి నియమితుల య్యారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవిలో ఇప్పటి వరకు తెరపై లేని షణ్ముగరెడ్డి అనూహ్యంగా తెరపై రావడం, ఆయన పేరును పార్టీ అధిష్టానం పరిశీలించి ఖరారు చేయడం చకచకా జరిగిపోయాయి. ఈ వ్యవహారంలో నగరి తెలుగుదేశం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ప్రస్తుతం రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సిఆర్ రాజన్ కొనసాగుతున్నాయి. తెలుగుదేశం పార్టీ అధిష్టానం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుల నియామకంపై ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించి ఆశావాహుల నుండి దరఖాస్తులు ఆహ్వానించడంతో ఆ మేరకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా విధులు నిర్వర్తించడానికి సుమారు 39 మంది నాయకులు పార్టీ పరిశీలకులుకు దరఖాస్తులు సమర్పించారు. ఈ క్రమంలో జిల్లా తెలుగుదేశం అధ్యక్ష పదవి ప్రస్తుతం బీసీ వర్గానికి చెందిన వారు వుండటంతో అదే వర్గానికి చెందిన వారికి ఈ సారి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి కేటాయించాలని పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడిన ఇతర వర్గాల నాయకులు స్తబ్దు అయ్యారు. ఈ క్రమంలో నిన్నటి వరకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి సిఆర్ రాజన్‌ను మరోమారు కొనసాగించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు వార్తలు వచ్చాయి. అయితే అనూహ్యంగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవికి నగరికి చెందిన షణ్ముగరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. షణ్ముగరెడ్డి ప్రస్తుతం జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులుగా, రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, నగరి నియోజకవర్గ పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జీగా కొనసాగుతున్నారు. ఈ మేరకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమితులైన షణ్ముగరెడ్డి త్వరలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

## టిడిపి జిల్లా అధ్యక్షుల ఎంపికలో మసకబారిన విజన్ !?

### ఇద్దరు నేతల నియామకంపై శ్రేణుల్లో అసంతృప్తి

### తిరుపతి జిల్లా అధ్యక్షురాలుగా పనబాక

తిరుపతి, డిసెంబర్ 16ప్రభాతవార్త:



పార్టీ శ్రేణులకు చేరువై కష్టాల్లో ఆత్మస్థైర్యం కల్పించే నాయకులకు పదవులు ఇస్తే పార్టీ బలోపేతం మరింతగా రెట్టింపవుతుందనేది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో పదవులు ఏదో కట్టబెట్టాలనే తపన తప్ప పార్టీ శ్రేణులకు దగ్గరగా ఉండే నాయకులకు జిల్లా అధ్యక్షపదవులు ఇవ్వలేదనేది నిర్మోహమాటంగా కార్యకర్తలు అసంతృప్తి వెల్లబుస్తున్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 18నెలల తరువాత సిఎం చంద్రబాబునాయుడు జిల్లా అధ్యక్షపదవులను భర్తీచేసే ప్రక్రియ మంగళవారం చేపట్టి కొందరు నాయకులను కుల, వర్గసమీకరణలతో ప్రకటించారు .సిఎం సొంతజిల్లాలో తిరుపతి జిల్లా పార్టీ పగ్గాలు మాజీ కేంద్రమంత్రి, టిటిడి బోర్డుసభ్యురాలు నెల్లూరుజిల్లాకు చెందిన పనబాక లక్ష్మికి కట్టబెట్టారు. ఈమె గత రెండుసార్లు తిరుపతి ఎంపిగా పోటీచేసి ఓటమిచవిచూశారు. 2024 ఎన్నికల తరువాత తిరుపతి జిల్లాలో, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పార్టీశ్రేణులకు అందుబాటులో లేకపోయారనేది, కార్యకర్తలకు కష్ట సమయంలో ఆమె కనీసం ఓదార్పులేదనేది తాజాగా విమర్శలు. నెల్లూరులో కాపురముంటున్న ఆమె ఎంతవరకు పార్టీశ్రేణులకు అందుబాటులో ఉంటారనేది ఇప్పుడు ప్రశ్నార్థకం. ఇప్పటికీ వైసిపి విమర్శలపై ఆమె నోరుతెరిచిన సందర్భం లేదనేది ఆరోపణలు. ఆమె పార్టీలో నేతలు, కార్యకర్తలను ఎంతవరకు సమన్వయపరిచి వైసిపి నేతలతో పోరాటం చేయడమనేది జరిగేపని కాదని వ్యతిరేకత వినిపిస్తోంది. విజనరీ ఉన్న చంద్రబాబు తన సొంత జిల్లాలో అధ్యక్షుల ఎంపిక విజన్ మసకబారిందనే బావురుమంటున్నారు. మరీ ఈమె ఇప్పుడు జిల్లాలో పార్టీనేతలను, కార్యకర్తలను, శ్రేణులను ఎలా ఒకేతాటిపై నడిపిస్తారనే విస్మయం వ్యక్తమవుతోంది. జిల్లా అధ్యక్ష పదవిలో అన్ని విధాలా ధీటైన, సమర్థవంతమైన నాయకులు ఉంటడమనేది అవసరమని పార్టీలో వాదనలు. చిత్తూరుజిల్లాకు సంబంధించి పుత్తూరుకు చెందిన వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగంను నియమించినట్లు తెలిసింది. వైసిపికి బలమైన నాయకత్వం ఉన్న రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ బలహీనమైన నేతలను అధ్యక్షులుగా నియమించారని కార్యకర్తలు మండిపడుతున్నారు.ఈయనకు పార్లమెంట్ కమిటీని నడిపించే సత్తా ఎంతవరకు ఉందనేది పార్టీలో భేరీజు వేసుకుంటున్నారు.

## ఫ్లెమింగో ఫెస్టివల్ - 2026 నిర్వహణకు ఏర్పాట్లు



తిరుపతికలెక్టరేట్, డిసెంబర్ 16 ప్రభాతవార్త :ఫ్లెమింగో ఫెస్టివల్ - 2026 ను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించాలని జిల్లా కల్లెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక కల్లెక్టరేట్ లో ని మినీ కాన్ఫెరెన్స్ హాల్ నందు ఫ్లెమింగో ఫెస్టివల్-2026 నిర్వహణపై కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మరియు జూ క్యూరేటర్ సెల్వం, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ డా.రమణ ప్రసాద్ లతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పులికాట్ సరస్సు పరిసర ప్రాంతాల్లో ప్రతి ఏటా జరుగుతున్న ఫ్లెమింగో పక్షుల వలస నేపథ్యంలో, 2026 జనవరి మాసంలో 10 మరియు 11 తేదీలలో రెండు రోజులు పాటు నిర్వహించబోయే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మరింత శాస్త్రబద్ధంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సంబంధించిన మైక్రో ప్లాన్ సిద్ధం చేయడం, తేదీలు ఖరారు చేయడం, కార్యక్రమాలు, పర్యాటక సదుపాయాలు, వేదికల ప్రణాళిక, పులికాట్ - నేలపట్టు, బి వి పాల్యం, అటకాని తిప్ప, ఇరక్కం ఐలాండ్ , ఉబ్బలమడుగు, పెరియ పాల్యం తదితర ప్రాంతాలల్లో ఏర్పా ట్లు చేయుటపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పర్యాటక మరియు సాంస్కృతిక అధికారి ఎం. జనార్ధన్ రెడ్డి, ఏపీటీడీసీ ఈఈ ఎస్ సుబ్రమణ్యం, పర్యాటక శాఖ సిబ్బంది, ఈవెంట్ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు

## గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి

### - కోటలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం




కోట, డిసెంబర్ 16 ప్రభాతవార్త

అశాస్త్రీయంగా గూడూరు నియోజకవర్గాన్ని గత ప్రభుత్వం తిరుపతి జిల్లాలో కలిపిందని జెఏసి నాయకులు, యుటిఎఫ్ నాయకులు జనార్ధనం, జెమ్మి ప్రసాద్, మీజూరు మల్లికార్జునరావు చెప్పారు. మంగళవారం కోట క్రాస్‌రోడ్డులో జెఏసి నాయకులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచార సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఒక్క చిన్న పనికి అయినా సామాన్యుడు జిల్లా అధికారులను కలిసేందుకు సుమారు 120 కిలోమీటర్లు ప్రయాణం చేసి తిరిగి రావాలంటే ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్నదని తెలిపారు. ఏ కారణం చేత అయినా జిల్లా అధికారులు అందుబాటులో లేకపోతే అక్కడే ఉండాల్సి వస్తుందన్నారు. సామాన్య ప్రజలకు, పేదలకు ఇది ఎంతో భారమన్నారు. రైతులు ఉన్నతాధికారులను కలవాల్సిన పరిస్థితి ఏర్పడితే వ్యవసాయ పనులు వదులుకుని సుదూరంలో ఉన్న జిల్లా కేంద్రానికి వెళ్లి రావాలంటే ఎంతో అసౌకర్యమన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్య బాధితులు దూరంగా ఉన్న జిల్లా కేంద్రానికి ప్రయాణించాలంటే ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. గూడూరు నియోజకవర్గ ప్రజలు అనాదిగా నెల్లూరు జిల్లాతో ఎంతో ముడిపడి ఉన్నారని తెలిపారు. ఇప్పటికే సంతకాల సేకరణ చేసి జిల్లా కలెక్టర్‌కు పంపించినట్లు తెలిపారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేంత వరకు కోటలో దీక్షలు కొనసాగుతాయని చెప్పారు. ఈ దీక్షలో ఆవుల సుబ్బయ్య, దాసరి సుందరం, వెంకటేశ్వర్లు, జెమ్మి ప్రసాద్, జనార్ధనం, యుటిఎఫ్ అధ్యక్షుడు ముచ్చల మనోహర్, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజాగొంతుక నుంచి ప్రజా ప్రతినిధిగా...

### పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ప్రస్థానం



చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త ప్రతినిధి

రాజకీయాలలో మార్పు రావాలని కోరుకునే వారు కొందరైతే, ఆ మార్పు కోసం స్వయంగా బరిలోకి దిగే వారు మరికొందరు. అటువంటి అరుదైన కోవకు చెందిన నాయకుడే పూతలపట్టు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఒక సాధారణ జర్నలిస్టుగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన వ్యక్తి, నేడు అదే ప్రజల తీర్పుతో చట్టసభలో అడుగుపెట్టారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరు జిల్లా పూతలపట్టు (ఎస్.సి) నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి ఘన విజయం సాధించిన మురళీమోహన్ ప్రయాణం స్ఫూర్తిదాయకం. ఆయన పూతలపట్టు మండలం, గొడుగుచింత అనే మారుమూల గ్రామంలో జన్మించారు. ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన ఆయన, పేదరికం మరియు గ్రామీణ సమస్యలను చిన్ననాటి నుండే ప్రత్యక్షంగా చూశారు. ఉన్నత విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని నమ్మిన మురళీమోహన్ వాణిజ్య శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అనంతరం తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుండి 2013లో పీహెచ్‌డీ) పట్టా పొంది "డాక్టర్" కలికిరి మురళీమోహన్‌గా గుర్తింపు పొందారు. రాజకీయాల్లోకి రాకముందు ఆయన సుదీర్ఘ కాలం పాటు పాత్రికేయుడిగా పనిచేశారు. జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతూ, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్‌లలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. రాజకీయ అరంగేట్రం ప్రశ్నించే గొంతుకగా ఉన్న జర్నలిస్టు, సమస్యలను పరిష్కరించే నాయకుడిగా మారాలని నిర్ణయించుకోవడం ఆయన జీవితంలో ఒక కీలక మలుపు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌కు ఆకర్షితులై ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. అధిష్టానం ఆయనపై నమ్మకం ఉంచి 2024 ఎన్నికలకు ముందు పూతలపట్టు నియోజకవర్గ బాధ్యతలను ఆయనకు అప్పగించింది. 2024 ఎన్నికలలో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మురళీమోహన్, తన సమీప ప్రత్యర్థి మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన సునీల్ కుమార్ పై ఘన విజయం సాధించారు. సుమారు 1,02,137 ఓట్లను సాధించి, దాదాపు 15,634 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

పూతలపట్టు నియోజకవర్గ విశేషాలు

చిత్తూరు జిల్లాలో రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన నియోజకవర్గం పూతలపట్టు. 2008 నియోజకవర్గాల పునర్విభజనలో ఇది ఏర్పడింది. ఇది ఎస్.సి రిజర్వ్ నియోజకవర్గం. ఈ నియోజకవర్గం పరిధిలో 5 మండలాలున్నాయి. పూతలపట్టు, ఐరాల, తవణంపల్లె, బంగారుపాలెం, యాదమరి. ఈ నియోజకవర్గం ఆధ్యాత్మికంగా చాలా ప్రసిద్ధి చెందింది. ప్రఖ్యాతి గాంచిన "కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం" (ఐరాల మండలం) ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉంది. నిత్యం వేల సంఖ్యలో భక్తులు వచ్చే ఈ ఆలయం నియోజకవర్గానికి ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చింది. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన మురళీమోహన్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. జర్నలిస్టుగా ఈ సమస్యలను చూసిన ఆయన, ఇప్పుడు వాటి పరిష్కారానికి నడుం బిగించారు. ఈ ప్రాంతం మెట్ట ప్రాంతం కావడం వల్ల వ్యవసాయానికి సాగునీటి కొరత ఉంది. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా ప్రతి చెరువుకు నీరు అందించాలనేది ప్రధాన డిమాండ్. అదేవిధంగా బంగారుపాళెం, దామలచెరువు ప్రాంతాల్లో మామిడి తోటలు అధికం. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం మరియు స్థానికంగా ఉన్న 'పల్ప్ పరిశ్రమల' ద్వారా రైతులకు న్యాయం చేకూర్చడం ఒక పెద్ద సవాలు. గత ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతినడం వల్ల రవాణా వ్యవస్థ మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. యువతకు ఉపాధి కల్పించడానికి చిత్తూరు చుట్టుపక్కల చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు లేదా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాల్సి ఉంది. విద్యావంతుడు, సౌమ్యుడు మరియు సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తిగా, పూతలపట్టు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ప్రజలు బలంగా నమ్ముతున్నారు. రాబోయే ఐదేళ్లలో ఆయన చేయబోయే అభివృద్ధి పనులు, నెరవేర్చబోయే హామీలే ఆయన రాజకీయ భవిష్యత్తును మరియు పూతలపట్టు నియోజకవర్గ రూపురేఖలను నిర్ణయిస్తాయి.

# తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ. 14.10 కోట్లు మంజూరు



యర్రావారిపాలెం, డిసెంబర్ 16, ప్రభాతవార్త: తలకోన శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.14.10 కోట్లు నిధులను టీటీడీ మంజూరు చేసిందని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. దాతల కాటేజ్ నిర్వహణకు నూతన సమగ్ర విధానం అమలు చేయడం జరిగిందన్నారు. యర్రావారిపాలెం మండలంలోని నెరబైలు గ్రామపంచాయతీ లో వెలసిన సిద్దేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు నిధులు వినియోగిస్తామని అన్నారు. మంగళవారం పాలకమండలి సమావేశంలో శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయానికి టీటీడీ పాలకమండలి చైర్మెన్ బి. ఆర్. నాయుడు, బోర్డు సభ్యులు నిధులను మంజూరు చేశారని అన్నారు. ఆలయ నిర్మాణ పనులకు మొదటి దశలో రూ.4 కోట్లు మంజూరు చేశారని అన్నారు. రెండవ దశలో రూ. 14.10 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులతో ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

కల్లూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్తఈ నెల 21వ తేదీ ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో సమిష్టిగా పనిచేసి విజయవంతం చేద్దామని పులిచెర్ల మండల స్థాయి అధికారులు సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమం పై మండల టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యల్లంకివారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ యల్లయ్య మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమం ద్వార పోలియో రహిత సమాజం ఏర్పడి చిన్నారులు అంగవైకల్యం బారిన పడకుండా కాపాడపడతారన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనే ఉద్దేశంతో వైద్య ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మొత్తం 3885 మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు.కార్యక్రమంలో మండల తహసీల్దార్ జయసింహ, పులిచెర్ల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, కల్లూరు వైద్యాధికారి డాక్టర్ ప్రవీన్, మండల విద్యాశాఖాధికారులు సిద్దరామయ్య, తాతయ్య, ఆరోగ్య విస్తరణాధికారులు చంద్రయ్య, కృష్ణయ్య, ఐసిడిఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి, హెల్త్ సూపర్ వైజర్ పురుషోత్తం పాల్గొన్నారు.

# వేడుకగా ధనుర్మాసస్వాగత భజనలు

-భక్తులకు ప్రత్యేక ప్రసాద వితరణ



తిరుపతి,డిసెంబర్ 16ప్రభాతవార్త: పవిత్రమైన ధనుర్మాసం ఆరంభం సూచకంగా తిరుపతిలో కోదండ రామస్వామి ఆలయ మాఢవీధుల్లో స్వాగత భజనలు, శ్రీరామ నామసంకీర్తనలు జరిగాయి. మంగళవారం ఉదయం రామలసీమ రంగస్థలి కళాసంస్థ చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆద్వర్యంలో కళాకారులు, భజనమండళ్ళు చిత్రపు హనుమంతరావుప, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి,కృష్ణయ్య, కస్పాపద్మనాభం, కర్నాట మురళి, కేశవరెడ్డి, సురేశ్‌స్వామి, లోకప్రభాకర్‌నాయుడు, తిరుపాల ఆచారి, శారద,నిర్మల, భాగవతుల విజయలక్ష్మి, రంగనాథన్, రాజశేఖర్‌రెడ్డి, కెఎన్‌రాజ,కృష్ణమూర్తిరెడ్డి తదితరులు పవిత్రమైన ధనుర్మాసంలో శ్రీమహావిష్ణువు అనుగ్రహం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు ప్రత్యేక ప్రసాద వితరణ చేశారు.

# వైసిపి యువజనవిభాగం నేత కారు ధ్వంసం



తిరుపతి,డిసెంబర్ 16ప్రభాతవార్త: తిరుపతి అక్కారాంపల్లిలోని రాధేశ్యామ్ అపార్టుమెంట్ వద్ద వైసిపి యువజనవిభాగం ప్రధాన కార్యదర్శి చైతన్య కారును దుండగులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం ఈ సంఘటన జరిగింది. బాధితుడు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కారాంపల్లిలోని రాధేశ్యామ్ అపార్టుమెంట్‌లో చైతన్య నివాసముంటున్నాడు. అర్ధరాత్రి దాటిన తరువాత కారును ధ్వంసం చేసిన సంఘటన సిసికెమెరాల్లో రికార్డుఅయ్యింది. ఇప్పటికే రెండుసార్లు చైతన్యపై దాడికి ప్రయత్నాలు జరిగాయని, తనకు ప్రాణహాని ఉందని ,రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. వైసిపి యువనేత భూమన అభినయ్‌రెడ్డి అనుచరుడుగా ఉన్నందుకే కక్షసాధింపుచర్యలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశాడు. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసిసిసి పుటేజీలను పరిశీలిస్తున్నారు.

# మద్యం దుకాణంలో చోరీ

తిరుపతి,డిసెంబర్ 16ప్రభాతవార్త:

తిరుపతిలో దుండగులు మద్యం దుకాణంలో చోరీ చేశారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన సంఘటన వివరాలు. తిరుపతి కరకంబాడిమార్గంలోని ఎస్‌విఎస్ మద్యం షాపు మూసివేసి తాళాలు వేసిన తరువాత షాపులో చేతివాటం చూపిన దొంగలు 2.45లక్షలు రూపాయలు నగదు చోరీ చేసినట్లు నిర్వాహకులు గుర్తించారు. మంగళవారం ఉదయం దుకాణం యజమాని మణిప్రసాద్ అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలిపిరి ఎస్ఐ స్వాతి కేసు నమోదు చేశారు.

# స్వచ్ఛ భారత్ లక్ష్య సాధనలో తిరుచానూరు పంచాయతీ ఆదర్శం

-వేస్ట్ టు వేల్త్ భవిష్యత్ తరాలకు చేరవేసేలా అమలుకావాలి



తిరుపతిరూరల్, డిసెంబర్ 16 ప్రభాతవార్త: స్వచ్ఛ భారత్ లక్ష్యాల సాధనలో తిరుచానూరు గ్రామ పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోందని అధికారులు ప్రశంసించారు. పరిశుభ్రతే లక్ష్యంగా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధాయ సృష్టికి మార్గం చూపుతున్న 'వేస్ట్ టు వేల్త్' -స్వచ్ఛ రథం సేవలు" తిరుచానూరు గ్రామ పంచాయతీలో అమలు అవుతున్నాయని, ఇతర పంచాయతీలకు తిరుచానూరు స్ఫూర్తిదాయకమని తెలిపారు. తిరుచానూరులో అమలవుతున్న వేస్ట్ టు వెల్త్ - స్వచ్ఛ రథం సేవలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు అంతపురం, సత్యసాయి, కర్నూలు,నంద్యాల, కడప జిల్లాల నుండి 36మంది డిప్యూటీ ఎంపిడిఓలు, ఏఓలు తిరుచానూరు గ్రామ పంచాయతీని సందర్శించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో అమలవుతున్న ఇంటింటా చెత్త సేకరణ, తడి-పొడి చెత్త ఏర్పాటు, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ విధానాలును క్షుణ్ణంగా పరిశీలించారు. స్వచ్ఛరథం సేవల ద్వారా గ్రామ పరిధిలో ప్రతిరోజు చెత్త సేకరణ సక్రమంగా జరుగుతుండటంతో పాటు తడి చెత్తను కంపోస్టుగా, పొడి చెత్తను పునర్వినియోగానికి తరలిస్తూ వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చే విధానం అధికారులను ఆకట్టుకుంది.పరిశుభ్రమైన గ్రామ వాతావరణం, ప్రజల భాగస్వామ్యం ఈ కార్యక్రమ విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. తిరుచానూరు పంచాయతీ కార్యదర్శి పియన్.మణి, డిఆర్‌పి షణ్ముహం, కిశోర్, బాలసుబ్రమణ్యంరెడ్డిలు స్వచ్ఛ రథం నిర్వాహణ విధానం, వ్యర్థాల ప్రాసెసింగ్‌పై వివరాలు వెల్లడించారు. అలాగే విస్తరణ శిక్షణ కేంద్ర-శ్రీకాళహస్తి సీనియర్ ఫ్యాకల్టీ మదుసూధన్, రమేష్, అమర్నాథ్‌లు అధికారులకు అవగాహన కల్పించారు. గత రెండు రోజులుగా తిరుపతి గ్రామీణ మండలంలో క్షేత్రస్థాయి పర్యటనలకు సమన్వయం అందించిన జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవికి, ఇతర జిల్లాల అధికారులకు తిరుపతిరూరల్ ఎంపిడిఓ దయాసాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

# భూ డాక్యుమెంట్లు దొరికితే తెలియజేయండి

వరదయ్యపాలెం, డిసెంబర్ 16, ప్రభాతవార్త

వరదయ్యపాలెం పంచాయతీ గంగ మిట్ట వీధి నివాసిరాలు సల్ల రవి భార్య సల్ల లోకేశ్వరి చెందిన ఇంటి డాక్యుమెంటు మిస్సింగ్ అయినదని ఎవరికైనా ఆచూకీ తెలిస్తే తనకు సమాచారం ఇవ్వగలరని బాధితురాలు కోరారు. గంగ మెట్ట వీధిలో ఉన్న ఇంటి ప్లాటుకు సంబంధించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెంబర్ 254/2008, వార్డ్ నెంబర్ 6 ఇంటి నంబరు 664/2. ఇంటికి సంబంధించి సర్వే నంబర్ 250 డాక్యుమెంట్ దారిపోయిందని బాధితురాలు తెలిపారు. ఎవరికైనా దొరికితే 6309469367 ఈ నెంబర్‌కి సమాచారం ఇవ్వాల్సిందిగా తెలిపారు.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వరదయ్యపాలెం, డిసెంబర్ 16, ప్రభాతవార్త



వరదయ్య పాలెం మండలంలోని అన్ని హైస్కూల్‌కు సంబంధించిన ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి బాలికలకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లల హక్కులు, సంరక్షణ అనే అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన వారికి సత్యవేదు ప్రాజెక్టు, సిడిపిఓ ఆర్ దేవ కుమారి, ఎంఈఓ సరస్వతి, వరదయ్యపాలెం హైస్కూల్ హెచ్ఎం ఇంచార్జ్ శ్రీధర్ వారి చేతులు మీద మొదట బహుమతి, ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతి, బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైసర్స్ సి. శిల్పా, ఎం. జ్యోతి, బి. నాగార్జున, జి. వెంకటేశ్వర్లు, కె.సరళ, బి.వెంకటేశ్వర్లలు తదితరులు పాల్గొన్నారు.

# బడుగుబలహీనవర్గాలకు అండగా నిలవాలి

తిరుపతి, డిసెంబర్ 16 ప్రభాతవార్త:



బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచి వారికి అవసరమైన చేయూతనందించాలని బిజెపి నాయకులు కోరారు. బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్రఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్‌బాషాను తిరుపతి జిల్లా బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్, హరి, అక్రమ్,రవి, కరుణాకర్‌రెడ్డి సయ్యద్‌ను ఆత్మీయంగా సత్కరించారు. బిజెపి,కూటమి ప్రభుత్వంలోనే ప్రజలకు, బడుగువర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని అన్నారు.

# రేపు క్రిస్మస్ హైటీ

చిత్తూరుహెల్త్, డిసెంబర్ 16 ప్రభాతవార్త: క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గురువారం సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ హైటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి చర్చి ఉపాసకులు, క్రైస్తవ సోదరీసోదరులు, విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

# సత్వరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లింపు

- జిల్లా ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు నాగరాజు డిమాండ్



చిత్తూరుహెల్త్, డిసెంబర్ 16 ప్రభాతవార్త: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులకు సత్వరం జీతాలు చెల్లించాలని జిల్లా ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు డిమాండ్ చేశారు. ఎస్టీయు కార్యాలయంలో మంగళవారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఈ నెల 16వ తేదీ అవుతున్నప్పటికీ జీతాలు చెల్లించలేదని ధ్వజమెత్తారు. నెలలో ఒక్క రోజు జీతం ఆలస్యం అయితే లక్షల, వేల రూపాయలు జీతాలుగా తీసుకునే ఉద్యోగులు తల్లడిల్లిపోతారని, అలాంటిని నెల ప్రారంభమై 16 రోజులైనా ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీతాలు చెల్లించకుంటే ఈనెల 20వ తేదీన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు దాసరి చంద్ర, మున్సిపల్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వాసు, జయశంకర్, వినాయక, సుగుణ, సుబ్రమణ్యం, రమణి, ఈశ్వర్, వినోద్, కస్తూరి, రంజిత్, చిత్ర, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ హ్యాకథాన్‌లో అపోలో విద్యార్థుల సత్తా



చిత్తూరుహెల్త్, డిసెంబర్ 16 ప్రభాతవార్త: విజయవాడలోని పీఎస్సీ ఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి ముప్పైఆరు గంటల హ్యాకథాన్ మైండ్‌స్ప్రింట్-2025లో అపోలో యూనివర్సిటీ విద్యార్థులు అద్భుత విజయం నమోదు చేసి జాతీయ వేదికపై తమ ప్రతిభ చాటుకున్నారు. బ్రెయినోవిజన్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, విద్యుత్-ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ల సంస్థ, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సహకారంతో నిర్వహించిన ఈ పోటీలకు దేశ వ్యాప్తంగా 19 రాష్ట్రాల నుండి సుమారు 2,400 మంది విద్యార్థులు హాజరయ్యారు. అపోలో యూనివర్సిటీకి చెందిన తొలి సంవత్సరం బిటెక్ కృత్రిమ మేధస్సు-డేటా సైన్స్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులతో పోటీ పడి జాతీయ స్థాయిలో తమ సత్తాను చాటుకున్నారు. అలాగే బయోమెడికల్ మెడి మైండ్స్ విభాగంలో వారు రూపొందించిన ఆరోగ్యమిత్ర యాప్ జాతీయ స్థాయి తొలి బహుమతి దక్కించుకోగా, అన్ని విభాగాల్లో మొత్త అపోలో యూనివర్సిటీ విద్యార్థులకు జాతీయ స్థాయిలో ఆరవ స్థానం లభించింది. ఈ జాతీయ హ్యాకథాన్‌లో పాల్గొని విద్యార్థుల ఆవిష్కర్తలను ప్రోత్సహించినందుకు ది అపోలో యూనివర్సిటీకి బ్రెయినోవిజన్ సొల్యూషన్స్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా అప్రిషియేషన్ సర్టిఫికేట్‌ను ప్రదానం చేశాయి. విజేతలుగా నిలిచిన బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజులు అభినందించారు. జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించడానికి కృషి చేసిన స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ డి.జగదీశన్, అపోలో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ అండ్ ఇన్‌క్యుబేషన్ సెల్ కన్వీనర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుధీర్‌లను వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.

# ఎంపీపీ మొగసాల రెడ్డెప్పను కలిసిన ఎంఈఓ



బైరెడ్డిపల్లి, డిసెంబర్ 16 ప్రభాతవార్త బైరెడ్డిపల్లి మండలానికి కొత్తగా బాధ్యతలు స్వీకరించినటువంటి మండల ఎంఈఓ మహబూబ్ బాషా,బైరెడ్డిపల్లి మండల ఎంపీపీ మొగసాల రెడ్డెప్పను మర్యాదపూర్వకంగా ఎంపీపీ కార్యాలయం నందు కలవడం జరిగినది.ఈ సందర్భంగా బైరెడ్డిపల్లి మండలానికి చెందినటువంటి ప్రాథమిక,ఉన్నత పాఠశాలలను అభివృద్ధి పథంలో నడపడానికి తమ వంతు సహాయ సహకారాలు కావాలని ఈ సందర్భంగా ఆయన కోరడం జరిగినది.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు యుటిఎఫ్,ఎస్ టి యు సంఘ నాయకులు,ఎమ్మార్పీలు పాల్గొన్నారు.

# పట్టుసాగు విస్తీర్ణాన్ని పెంచాలి - ఎంఎంసి చైర్మన్



కుప్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త కుప్పం నియోజకవర్గంలో పట్టుసాగు విస్తీర్ణాన్ని అధికారులు మరింత పెంచాలని ఎఎంసి చైర్మన్ జిఎం రాజు సూచించారు. మంగళవారం స్థానిక సిరికల్చర్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశమై రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం సాగులో ఉన్న 5238 ఎకరాల విస్తీర్ణంను పెంచాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు చొరవతో కుప్పానికి కృష్ణాజలాలు రావడంతో రైతులు పంటసాగుపై మక్కువ చూపేలా చర్యలు చేపట్టాలన్నారు. పట్టుసాగు చేపట్టే రైతులకు పెద్ద షెడ్‌కు 3.37లక్షలు, చిన్నషెడ్‌కు 2.47లక్షలు,నారు కోసం ఎకరాకు రూ22500లు కూటమి ప్రభుత్వం రాయితీగా అందిస్తోందన్నారు. రీలింగ్ యూనిట్లకు కూడా 1.5కోట్ల యూనిట్‌కు కూటమి ప్రభుత్వం 1.12కోట్ల రాయితీ ఇస్తుందన్నారు. కుప్పంలో త్వరలోనే అత్యాధునిక మూడు రీలింగ్ యూనిట్లు అందుబాటులో వస్తాయన్నారు. సమావేశంలో పట్టుశాఖ ఎడి, వైస్‌చైర్మన్ శరవణ, సభ్యులు తులసి, ఇర్ఫాన్,రైతులు పాల్గొన్నారు.

# గురుకులంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



రామకుప్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త స్థానిక డా॥ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, విశ్రాంత ఐఎఎస్ అధికారి భాను పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నేతలతోకలసివారుగురుకులపాఠశాలస్థితిగతులపై సమీక్షించారు.హాస్టల్ గదులు,భోజన శాల, మరుగుదొడ్లు, నీటి వసతి, ఆట స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకువిద్యార్థులకుఆహారం సరఫరా చేయాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న విశ్రాంత ఐఎఎస్ అధికారి భాను మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు అమలుచేస్తున్న సంక్షేమ పథకాల్లో అర్హులకు లబ్ధి కలిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, నేతలు ఆంజనేయరెడ్డి, నరసింహులు,విశ్వనాథ్,రఘు,సీతాపతి,బాలు,అల్లిశీన, ఆదిల్, సురేష్, నవీన్, మురళి, శంకరప్ప పాల్గొన్నారు.

# రైతులకు రాయితీ ఉలవలు పంపిణీ



రామకుప్పం,డిసెంబర్ 16 ప్రభాతవార్త రైతులకు ప్రభుత్వం రబీ సీజన్‌లో రాయితీతో అందిస్తున్న ఉలవలను మంగళవారం ఆనిగానూరు రైతు సేవా కేంద్రంలో నేతలు పంపిణీ చేశారు. రైతులకు ఐదు కిలోల వంతున ఉలవలు పంపిణీ చేయడం జరుగు తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలోనేతలురామమూర్తి,జయశంకర్, మనేష్,కృష్ణారెడ్డి,మహేంద్రనాయుడు,రామలింగం, గోపాల్‌రెడ్డి, మురుగేష్,ఎఓమహేష్,రైతులు పాల్గొన్నారు.

# ఏడాది కో దూడ !!! పాడి రైతుల ఇంట సిరుల పంట



సోమల, డిసెంబర్ 16 ప్రభాతవార్త ఏడాదిలో ఒక పశువు బిడ్డకు జన్మనిచ్చేలా రైతులు మెలకువలు పాటిస్తే రైతు ఆర్థికంగా బలవంతులు అవుతాడని కందూరు పశువైద్యాధికారిని చందన ప్రియ అన్నారు. వల్లి గట్ల పంచాయతీ గొల్లపల్లిలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 280 పశువులకు 51 దూడలకు పిడుదుల నివారణకు మందులు పిచికారీ చేశారు. అలాగే నట్టల నివారణకు మందులు అందించారు. 22 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని మాట్లాడుతూ చలికాలంలో పశువులకు సంక్రమించే రోగాల గూర్చి వాటిని రైతులు ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. పశువులలో గ్రాసం కొరత నివారించేందుకు హైబ్రిడ్ గడ్డిని పెంచుకోవాలని సూచించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాదిహామీ పథకం ద్వారా అర్ధ ఎకరా సాగుకు 30 వేల రూపాయలు సబ్సిడీ అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది అల్తాఫ్,సహదేవ,సురేష్, సుధాకర్, మరియు గ్రామ నాయకులు భద్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# శబరిమలైకు మహాపాదయాత్ర



సోమల, డిసెంబర్ 16 ప్రభాతవార్త

మండలంలోని ఇరికిపెంట పంచాయతీ మేటి మంద కు చెందిన 15 మంది అయ్యప్ప భక్తులు కాలినడకన శబరిమలైకు తరలి వెళ్లారు. గురు స్వామి పాల పెద్దబ్బ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు కాలినడకన 18 రోజులు ప్రయాణించి శబరిమలైలో అయ్యప్పను దర్శించుకోనున్నారు. కాలినడకన వెళ్లే అయ్యప్ప భక్తులను పంచాయతీ ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే గంగిరెడ్డిపల్లి ఎర్ర నాగులవారిపల్లి గ్రామ ప్రజలు అయ్యప్ప భక్తులకు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

# హెల్మెట్ ధరించండి ప్రమాదాలు నివారించండి

పాలసముద్రం, డిసెంబర్ 16 ప్రభాతవార్త



మండలంలోని ప్రజలందరూ సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి గా ధరించాలి హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహన నడిపితే రూ. 1035 అపరాధ రుసుం.కారు నడిపే ప్రయాణికుడు సీటు బెల్టు తప్పనిసరి గా ధరించాల అని స్థానిక ఎస్సై రాజశేఖర్ అన్నాడు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ ట్రాక్టర్లు వెనుక భాగం రేడియం స్టిక్కర్లు అతికించుకోవాలి.. వాహనదారులు సురక్షిత ప్రయాణానికి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సూచించారు. జిల్లా ఎస్పీ తుషార్ దూడీ ఆదేశాల మేరకు హెల్మెట్ పై వాహనదారులకు సూచనలు చేశారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేదంటే మోటార్ వెహికల్ నిబంధనల ప్రకారం అపరాధ రుసుము తో పాటు, లైసెన్సులను కూడా రద్దు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. అతివేగం, సెల్ఫోన్ డ్రైవింగ్ చేయరాదని ప్రతి చోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వాటి ద్వారా వాహనాలను పరిశీలించి జరిమాన వేసే అవకాశం ఉందని ఈ సందర్భంగా తెలిపారు.

# బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు : మధుబాబు



చౌడేపల్లి, డిసెంబర్ 16 ప్రభాతవార్త బాల, బాలికలను పనుల్లో పెట్టుకొంటే కఠిన చర్యలు తప్పవని పుంగనూరు కార్మికాధికారి మధుబాబు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రమైన చౌడేపల్లిలోగల పలు దుకాణాలను తనిఖీ చేసారు. కార్మిక చట్టానుసరించి ఎవరైనా 14యేళ్ళలోపు పిల్లలను పనిలో పెట్టుకోరాదన్నారు. అదే విధంగా దుకాణాల్లో పనిచేస్తున్న వ్యక్తులకు కార్మిక చట్టాన్ని అనుసరించి పనికితగ్గ కూలీ చెల్లించాలన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. అదే విధంగా దుకాణదారులు కార్మికదృవీకరణ పత్రాలను సకాలంలో తీసుకోవాలన్నారు. ఫ్యాన్సీస్టోర్లు, స్కూటర్, సెల్‌ఫోన్, జ్యువలరీ, హోటళ్ళు, టీదుకాణాలలో తనిఖీ చేసి, కార్మిక చట్టాలను వివరించారు. ఎంఇఓ కేశవరెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సులోచనా, రాధ, పోలీసు, ఎస్‌డబ్ల్యు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రతతోనే అంటువ్యాధులకు దూరం



చౌడేపల్లి, డిసెంబర్ 16 ప్రభాతవార్త వ్యక్తిగత పరిశుభ్రతతోనే అంటు వ్యాధులకు దూరంగా వుండవచ్చునని వైద్యాధికారిణి మోనా అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా వ్యాధి కారకాల్లోనూ మార్పులు వస్తుంటాయన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధులు రాక ముందే జాగ్రత్తలు తీసుకొంటూ రోగాలు దరిచేరవన్నారు. ఏవైనా జబ్బులు చేస్తే సమీపం ఆరోగ్య కేంద్రంలో చూపించుకోవలన్నారు. ప్రైవేటు వైద్యానికి వెళ్ళకూడదనీ, మూఢనమ్మకాలు నమ్మద్దన్నారు. అనంతరం చలికాలంలో సోకే వ్యాధులు, వాటి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# అతిగా మద్యం సేవించి గిరిజనుడి మృతి

మేకలచిన్నేపల్లి(చౌడేపల్లి), డిసెంబర్ 16 ప్రభాతవార్త



అతిగా మద్యం తాగి గిరిజనుడు మృత్యువాత పడ్డ సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు...మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీ తామరాకులొద్దుకు చెందిన కుట్టి(38)అడవిలో దొరికే ఫలసాయాన్ని విక్రయించుకొంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి సమీపంలోని మేకలచిన్నేపల్లిలో సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించాడు. ఉదయాన్నే అతను రోడ్డుపై పడున్నాడు. స్థానికులు వెళ్ళి చూడగా అప్పటికే మృతి చెందాడు. బెల్టుదుకాణాల్లో దొరుకుతున్న మద్యం సేవించడం వల్లనే కుట్టి మృతి చెందాడని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు.

# అటల్‌జీ సేవలు చిరస్మరణీయం: మాజీ ఏబీవీపీ విజయ శంకర్



పుంగనూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త పట్టణానికి చెందిన మాజీ ఏబీవీపీ సీనియర్ నాయకుడు విజయ శంకర్ మదనపల్లిలో జరిగిన భారతరత్న, మాజీ ప్రధానమంత్రి శ్రీ అటల్ బిహారి వాజ్పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం తిరుగు ప్రయాణమైన ఉత్తరాఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రికి మదనపల్లి హెలిపాడ్ వద్ద ఆయన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విజయ శంకర్ ముఖ్యమంత్రి గారితో స్నేహపూర్వకంగా మాట్లాడారు. భారతదేశ అభివృద్ధి, జాతీయ ఐక్యత కోసం అటల్ బిహారి వాజ్పేయి చేసిన విశిష్ట సేవలు చిరస్మరణీయమని ఆయన పేర్కొన్నారు. అటల్‌జీ అందించిన సేవలు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయని విజయ శంకర్ అన్నారు. అటల్ బిహారి వాజ్పేయి జీవితం దేశానికి ఆదర్శమని, ఆయన ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకమని విజయ శంకర్ ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# బాల్య వివాహం బ్రతుకంతా నష్టం

పుంగనూరు డిసెంబర్ 16 ప్రభాతవార్త



పెళ్లి ఈడు రాకుండా నేటికీ గ్రామాలలో బాల బాలికలకు వివాహ వివాహం నిర్వహించడం చేస్తున్నారని, ఈ బాల్య వివాహాల వల్ల వారి జీవితాలు కష్టాల మయమై అనర్థాలకు దారితీస్తాయని జిల్లా కలెక్టరేట్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ చందు రాణి అన్నారు.ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బాల్య వివాహ ముక్త భారత్ ప్రతిజ్ఞ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు బాల్య వివాహాల కారణాలు, వాటి వల్ల కలిగే నష్టాలు, బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె అవగాహన కల్పించారు. జిల్లా పిల్లల రక్షణ యూనిట్ ప్రొటెక్షన్ అధికారి రాధా రాణి మాట్లాడుతూ, టీనేజ్ దశలో పిల్లలు ఆకర్షణలకు లోనై తమ భవిష్యత్తును దెబ్బతీసుకునే ప్రమాదం ఉందని తెలిపారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ నాయుడు మాట్లాడుతూ, విద్యార్థినిలు క్రమశిక్షణతో మెలగాలని, బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌కు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా పోలీసులు శ్రీలక్ష్మి, మనోమిత్ర వైష్ణవి, కళాశాల అధ్యాపకులు రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి శరవణ కుమార్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సుకుమార్ బాబు సూచనతో స్పందించిన ప్రజారోగ్య శాఖ



పుంగనూరు రూరల్, డిసెంబర్ 16 ప్రభాతవార్త పట్టణంలోని 24వ వార్డులో కాలువలు పేరుకుపోయాయని వెంటనే శుభ్రం చేయాలని విశ్రాంత డిఎస్పి తెలుగుదేశం నాయకుడు సుకుమార్ బాబు మున్సిపల్ అధికారులకు సూచించడంతో వెంటనే స్పందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. 24వ వార్డుకు చెందిన హైస్కూల్ వీధి రామాలయం వీధి నుంచి ప్రవహించే కట్టువ కాలువ చెత్తాచెదారాలతో నిండిపోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని విశ్రాంత డీఎస్పీ సుకుమార్ బాబు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి కు తెలియజేసి చర్యలు చేపట్టాలని కోరారు. కమిషనర్ ఆదేశాలతో మంగళవారం పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాపన్న స్కూల్ ముందర కాలవలో పేరుకుపోయిన పూడికను తొలగించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు తీసుకున్న చర్యలకు 24వ వార్డు ప్రజలు విశ్రాంత డీఎస్పీ సుకుమార్ బాబు, కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మున్సిపాలిటీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు మైనార్టీ నాయకుడు అఫ్రోజ్‌తో పాటు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# 203 అదనపు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

## - రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

చిత్తూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త:

జిల్లాలో 203 అదనపు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని నాగర్జున ఐఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళ వారం కలెక్టర్ సుమిత్‌కుమార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 15,75,899 మంది ఓటర్లు వున్నారని, ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ మేరకు ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా బోగస్, మృతి చెందిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించి పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 1,776 పోలింగ్ స్టేషన్ల పరిధిలో బిఎల్ఓలకు ఈ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బిఎల్ఎ ద్వారా పరిశీలించవచ్చునన్నారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి వచ్చిన బోగస్, మృతి చెందిన వారి వివరాలను బిఎల్ఓలకు తెలియజేసి వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించే కార్యక్రమానికి సహకరించాలన్నారు. అలాగే కలెక్టర్ గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం గోడౌన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్, కాంగ్రెస్ ప్రతినిధి పరదేశి, బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, వైకాపా ప్రతినిధి ఉదయ్‌కుమార్, ఎలక్షన్ సెల్ సూపరిటెండెంట్ రాజేంద్ర, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఏర్పేడులో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న పోలీసులు



**ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్), డిసెంబర్ 16 ప్రభాతవార్త** ఏర్పేడులోని పెట్రోల్ బంకుల్లో పోలీసులు ప్రజల్ని హెల్మెట్‌లు ఎందుకు ధరించాలనే విషయంగా చైతన్యం కల్పించారు. జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు సిఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి వారి సహచరులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.నేడు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం బాధితులు హెల్మెట్ ధరించక వాహనాలు నడపటం వల్ల చిన్న ప్రమాదంలో కూడా ప్రాణాలు కొల్పోతున్నారని ఈ ప్రమాదాల నుంచి మనల్ని మనం రక్షించుకొనుటకు హెల్మెట్ ధరించాలని సూచించారు. రాబోవు రోజుల్లో హెల్మెట్ ధధరించిన వారికి మాత్రమే పెట్రోల్ సరఫరా చేయాలని యజమానులను ఆదేశించారు.

## ఇవి రోడ్లా? మడుగులా?



**శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఆర్ అండ్ బి రోడ్లు ఏళ్ళ తరబడి మరమ్మత్తులకు నోచుకోక ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శ్రీకాళ హస్తి-పాపానాయుడుపేట వయా వేడాం,శ్రీకాళహస్తి-పాపానాయుడుపేట వయా తొండమనాడు, శ్రీకాళహస్తి-పల్లాం,శ్రీకాళహస్తి పంగూరు, శ్రీకాళహస్తి-కాసరం,బివిపురం,మన్నవరం రింగ్ రోడ్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. వైకాపా హయాంలో ఐదేళ్ళ పాటు రోడ్ల మరమ్మత్తులకు ఒక్క పైసా కూడా విదల్చలేదు.దాంతో వర్షాలకు రోడ్డు ధ్వంసమయ్యాయి. దాంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పరిస్థితి దయనీయంగా మారింది. రోడ్లు పూర్తిగా ధ్వంసం కాగా గత నెల కురిసిన వర్షాల నీరు ఇప్పటికి రాకపోకలకు శాపంగా మారింది.ముఖ్యంగా శ్రీకాళహస్తి-వేడాం-రామాపురం రోడ్ల పరిస్థితి పరిశీలిస్తే రోడ్డు జాడ కనబడటం లేదు. ఎటు చూసినా మడుగులే మడుగులన్నట్లు మారింది, పెద్దమిట్ట కండ్రిగ వద్ద రోడ్డుపై వరద నీరులా నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతుంది. ఈమార్గంలో ప్రతి నిత్యం వందలాది వాహనాలు పరుగులు తీస్తుంటాయి.ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్రవాహన చోదకులు భయబ్రాంతులౌతున్నారు. ఇక్కడ రోడ్డు మీద నీళ్ళు నిలవటమే కాకుండా పాములు కూడా నివాసముంటున్నట్లుంది. ఇప్పటికైనా అర్ అండ్‌బి అధికారులు స్పందించాలని శాసనసభ్యుడు నిధులు సాధించాలని ప్రజలు కోరుతున్నారు.

## త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రచారం



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 16 ప్రభాతవార్త** త్రైత సిద్ధాంత ప్రభోధ సేవా సమితి ఇ ందూ జ్ఞాన వేదికకు సంబంధించిన కమిటి సభ్యులు మంగళవారం పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీలో ఇంటింటికి దేవాలయముల నిజ అర్థాన్ని తెలిపే త్రైత సిద్ధాంత గ్రంధాలను పంపిణి చేసారు.ఈ సందర్బంగా క మిటి అధ్యక్షులు చింతా సుబ్రమణ్యం వివరిస్తూ త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రందాల ద్వారా దేవాలయముల నిజ అర్థం తెలియజేయబడుతుందని వివరిస్తూ ఏడు గోపురాలు ఏడు ద్వారాలు,ధ్వజస్తంభం,గంట, ప్రదక్షిణలకు సంబంధించిన రహస్య జ్ఞానం తెలియజేయ బడుతుందని ఆయన వివరించారు. శరీరం దేవాలయమైతే ఇందులో ఉన్న ఆత్మను దేవునిగా తెలుసుకోవడమే నిజమైనజ్ఞానం అని తెలిపారు.త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుని అసలైన జ్ఞానంను తెలియజేస్తుందన్నారు, ప్రతి ఒక్కరు కర్మ యోగం, విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానాన్ని తెలుసు కోవాలనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమాల్లో తనతో పాటు ఏకాంబరం,కృష్ణప్రభోధ,లీలాకృష్ణ,అమరావతి,వెంకటరత్నమ్మ,వెంకటలక్ష్మీ,చామంతిలు పాల్గొన్నా రు.

## రోడ్ల మీద మురికి నీరు : పరిశీలించిన దేశం నాయకుడు



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో మురుగునీటి కాలువల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారాయి. ముఖ్యంగా పానగల్‌లో రోజు రోజుకు మురుగునీటి కాలువల పరిస్థితి ఆందోళన కల్గిస్తుంది. గతంలో ఇక్కడ ఎలాంటి హోటళ్ళు కాని, లాడ్జిలు కానీ వ్యాపారసంస్థలు లేవు. ప్రస్తుతం పేరొందిన హోటళ్ళు, రెస్టారెంట్లు వెలిసినాయి.ఈ నేపథ్యంలో మార్కెటింగ్ కమిటి ఎదురుగా ఉన్న లేన్లలో మురుగునీటి కాలువల పరిస్థితి అధ్వాన్నంగా మారింది.కాలువల్లోంచి నీళ్ళు ప్రధాన కాలువలోకి వెళ్ళాల్సిం ది. కాలువలోని వ్యర్థాలు లేన్లలో కాలువల్లోకి వెళుతుంది. దాంతో నివాసం ఉండే వారు ఇబ్బందులు పడుతున్నారు.ఇక్కడ ప్రధాన కాలువలు వంకట టింకరగా నిర్మించారు.దాంతో కాలుల్లోంచి వెళ్ళాల్సి న మురుగు నీరు చిన్న కాలువల్లోకి పారుతుంది.రోడ్డు మీద మురుగునీరు పారు తుండటంతో గమనించిన శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి దృష్టికి వచ్చింది.ఇక్కడ కనీష్క హోట ల్ సమీపంలోని కాలువలు వ్యర్థ పదార్థాలు నిండాయి. మురికి నీరు రోడ్లపైకి వచ్చింది.దాంతో సోమ వారం పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, పట్టణ కార్యదర్శి కాసరం రమేష్, కె.వి.ప్రతాప్‌రెడ్డి, మురళి, పోలూరు శ్రీనివాసులు రెడ్డి, నాగరాజు, ఆర్ముగం, నెమళ్ళూరు బుజ్జి చంద్రకుమార్ ప్రకాష్, కిరణ్‌లు కలసి స్థానిక ప్రజలతో చర్చించారు.గతంలో కమిషనర్ భవాని ప్రసాద్ దృష్టికి కూడా వచ్చింది.

## జనసేన పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించండి!



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలో జనసేన పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని మంగళవారం ఆర్‌డిఓ కార్యాలయంలో డిఏఓ శాంతికి వినతి పత్రం సమర్పించారు. జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ సారధ్యం లో వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా చక్ర ధర్ మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యాలయానికి స్థల ం కేటాయించాలని స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డిని కోరారు.ఆయన సానుకూలంగా స్పందించారు.జనసేన పార్టీ స్థాపించి 12 సంవత్సరాలు అయ్యిందన్నారు .జాతీయ ఎన్నికల కమిషన్ జనసేన పార్టీని గుర్తింపు పార్టీగా పరిగణించిందన్నారు.బలమైన ఓటు బ్యాంకును కలిగిన పార్టీగా జనసేన అభివృద్ధి ఉందన్నారు.పార్టీ కార్య క్రమాలు నిర్వహించుటకు జనసేన పార్టీకి భవనం కావాలన్నారు.ఈ కార్యక్రమాల్లో పగడాల సుధాకర్,మధు, కిషోర్, యర్రంశెట్టి శ్రీనివాసులు, లోకనాధంరెడ్డి, సిసింద్రీ,లోకేష్‌బాబు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో విజయ్ దివాస్



**తొట్టంబేడు, డిసెంబర్ 16 ప్రభాతవార్త** నారాయణ పాఠశాలలో మంగళవారం విజయ్ దివాస్‌ను ఘనం గా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సి పల్ ఈశ్వర్ అధ్యక్షతన కార్యక్రమూలను ఏర్పాటు చేసారు. భారతదేశం-పాకిస్తాన్ మధ్య 1971లో జరిగిన యుద్ధంలో భారత్ సాధించిన చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకొని ఉద్దేశంతో ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నామని వివరించారు. విద్యార్థులు భారత దేశ చరిత్రకు సంబంధించి అవగాహన కల్గి ఉండాలన్నారు. పాకిస్తాన్ సైన్యం భారత్‌ముందు లొంగిపోవటంతో బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా అ వతరించిందన్నారు.ఈ కార్యక్రమాల్లో చిన్నారులు భారత ఆర్మీ, సైనికుల వేషధారణ డాక్టర్లు, నర్సులు,దేశం ప్రాణాలర్పించిన మహానుభావుల వేషధారణలో ఆకట్టుకున్నారు.

## చుక్కల నిడిగల్లులో ఉచిత కంటి వైద్యశిబిరం




**శ్రీకాళహస్తి,డిసెంబర్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు గ్రామంలో మంగళవారం శ్రీ శుకబ్రహ్మాశ్రమం సారధ్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆశ్రమం నిర్వహిస్తున్న త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి సారద్యంలో చుక్కల నిడిగల్లు ఎస్‌సి కాలనీలో శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ప్రతి నెల పరిసరాల్లోని దళిత,గిరిజన వాడల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఆసుపత్రి కోఆర్టినేటర్ వి.దొరస్వామి పర్యవేక్షణలో సిబ్బంది శిబిరాన్ని నిర్వహించి 42 మందికి వైద్యపరీక్షలు జరిపారు. వీరిలో 24 మంది కంటి శుక్లాలు ఉన్నాయని గుర్తించారు. వైద్యపరీక్షలు జరిపించుకున్న వారికి ఉచితంగా మందులు ఆశ్రమం తరపున అందించారు. సేవల్లో ఆసుపత్రి స్టాఫ్‌నర్సు ఎన్ దామోదరం, భవాని గ్రామస్తులు వెంకటరమణయ్య,పెద్ద గురవయ్య, పి.సిద్ధయ్య, సి.రాజ్‌కుమార్ పర్యవేక్షించారు

## అమ్మవారిని దర్శించుకున్న కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి



**సత్యవేడు, డిసెంబరు 16 ప్రభాతవార్త:** సత్యవేడు పట్టణంలో ఓం శక్తి అమ్మవారిని మధ్యాహ్నం 12.30 గంటలకుదర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందానని, సత్యవేడు మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండే విదంగా చల్లగా చూడాలని కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఓంశక్తి అమ్మవారిని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓంశక్తి ఆలయ నిర్వాహకురాలు శోభారాయల్,సెల్వి, ప్రదీప్ రాయల్, కృష్ణా రాయల్, భరత్ రాయల్ ఆహ్వానం మేరకు తాను విచ్చేశానంటూ శంకర్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాల అందించారు. ఆలయ నిర్వాహకురాలు శోభారాయల్, ఓం శక్తి భక్తుల బృందం,భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి పరమశివం,నాయకులు కిష్టయ్య,శివానందం, షణ్ముగం, రాజయ్య, రవి, ఆది, ప్రదీప్ రాయల్, కృష్ణా రాయల్,బాలరాజు, మురళి తదితరులు ఉన్నారు.

## ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన ధ్యేయం




**తిరుపతి విద్య,డిసెంబర్ 16 ప్రభాత వార్త** సంస్థ వ్యవస్థాపకులు రామి రాయ్ రెడ్డి తిరుపతి కరకంబాడి రోడ్డులోని కో వర్క్ స్పేస్ సంస్థ ఏడవ వార్షికోత్సవాన్ని వారి కార్యాలయంలో సంస్థ ఉద్యోగులు అతిథుల నడుమ ఘనంగా నిర్వహించారు. తిరుపతి నగరంలోని ఉన్నత విద్యను అభ్యసించిన యువతకు వివిధ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ఈ సంస్థను స్థాపించినట్లు సంస్థ వ్యవస్థాపకులు రామి రాయ్ రెడ్డి తెలియజేశారు. మెట్రో నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్న తిరుపతి మహానగరంలో సాంకేతిక రంగాలలో అడుగుపెట్టేందుకు గతంలో యువకులు పక్క రాష్ట్రాలకు నగరాలకు ఉద్యోగ అవకాశాలను వెతుక్కుంటూ వెళ్లవలసి వచ్చేదని కానీ ఈ సంస్థ ద్వారా యువకులు తమ సొంత నగరంలోనే ఉపాధి పొందేందుకు ఈ సంస్థ ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు తమ ప్రసంగంలో ఆనందాన్ని వ్యక్తం చేశారు. వినూత్న రీతిలో వివిధ ఆలోచనలు కలిగిన ఆరుగురు వ్యక్తుల ఆలోచన రూపమే ఈ సంస్థకు పునాది అని, ఈ సంస్థ ద్వారా తిరుపతి నగరంలోని యువకులు కార్పొరేట్ నగరాలకు దీటుగా తమ సొంత నగరంలోనే అత్యున్నత ఉపాధి అవకాశాలు పొందుతున్నారని పలువురు వక్తలు సంస్థ వ్యవస్థాపకలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర కుమార్ కోపొండర్, స్వరూప డైరెక్టర్, దివ్య తేజ డైరెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

## యస్వీయూ ఆరోగ్య కేంద్రానికి పోర్టబుల్ ఈసిజి యంత్రం



**తిరుపతి విద్య, డిసెంబర్ 16 ప్రభాతవార్త** యస్వీయూ వైస్‌ఛాన్సలర్ ఆచార్య టాటా నరసింగరావు, వవర్శిటీ క్యాంపస్‌లో ఆరోగ్య సంరక్షణ కేంద్రం సేవలను బలోపేతం చేయడానికి తన వ్యక్తిగత సహ కారం గా మంగళవారం యస్వీయూ హెల్త్ సెంట ర్ కు పోర్టబుల్ ఈ సి జి యంత్రాన్ని విరాళంగా ఇచ్చా రు.యస్వీయూ హెల్త్ సెంటర్‌ను మొదటిసారి సందర్శించినప్పుడు, ఉన్న ఈ సి జి యంత్రం సరైన స్థితిలో లేదని గమనించిన వైస్‌ఛాన్సలర్ వెంటనే స్పందించిన అధికారిక విధానాల కోసం వేచి ఉండకుండా తన సొంత నిధుల నుండి కొత్త పోర్టబుల్ ఈ సి జి యంత్రాన్ని విరాళంగా ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు, సిబ్బంది , క్యాంపస్ నివాసితులకు సకాలంలో ఆరోగ్యాన్ని నిర్ధారించడానికి యూనివర్సిటీ హెల్త్ సెంటర్ సౌకర్యాలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో, ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సమర్థ వంతంగా చికిత్స అందించడానికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ సి జి యంత్రంధరరూ.27,00రూపాయలు రోగిసంరక్షణకోసం యంత్రాన్ని సమర్థవంతంగా ఉపయో గించుకునే సూచనలతో అధికారికంగా హెల్త్ సెంటర్‌లోని ల్యాబ్ టెక్నీషియన్ ముత్తు వేలుకు అందజేశారు.

## సీకాం డిగ్రీ కళాశాలకుకు ప్రైడ్ అఫ్ నేషన్ అవార్డు



**తిరుపతి విద్య,డిసెంబర్ 16 ప్రభాత వార్త** సీకాం డిగ్రీ కాలేజ్ కు, వెటరన్స్ ఇండియా ఆధ్వర్యంలో విజయ్ దివస్ సందర్భంగా నిర్వహించిన ప్రైడ్ అఫ్ నేషన్ అవార్డు 2025 లో హానర్ అఫ్ పార్టిసిపేషన్ పురస్కారం లభించింది.ఈ కార్యక్రమం ఎఐసిటీఈ ,ఎన్ బి ఏ,ఏ ఐ యూ ,ఈ పి ఎస్ ఐ , భారతదేశంలోని ప్రముఖ ఉన్నత విద్యా సంస్థల సహకారంతో, న్యూఢిల్లీ లోని ఎన్ డి ఏం సి కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించబడింది.ఈ ప్రతి రామ్ లాల్ జీ, వెటరన్స్ ఇండియా వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు డా. బి.కే. మిశ్రా ఎన్ బి ఎ,నాక్ ,అండ్ నెక్స్ట్ చైర్మన్ వెటరన్స్ ఇండియా ప్యాట్రన్ డా. అనిల్ సహస్రబుద్ధే, అలాగే ఎఐసిటీఈ చైర్మన్ ప్రొ.డా. టి. జి. సీతారాం పాల్గొని కార్యక్రమానికి విశేష గౌరవాన్ని చేకూర్చారు.ఈ గుర్తింపు, అకడమిక్స్‌కు మించి కార్యక్రమాల ద్వారా జాతీయత, దేశభక్తి , దేశ నిర్మాణంలో సీకాం డిగ్రీ కాలేజ్ చూపిన ఉత్తమ సేవలకు నిదర్శనం. ఇది సీకాం అకడమిక్ సమాజానికి గర్వకారణమైన ఘట్టం.అదనంగా, సీకాం డిగ్రీ కాలేజ్ కు 2025 సంవత్సరంలో రెండవసారి నాక్ గుర్తింపు (అక్రెడిటేషన్ ) లభించడంతో పాటు, స్వయం పాలిత (అటానమస్ ) హోదా కూడా మంజూరైంది. ఇది కళాశాల యొక్క విద్యా నాణ్యత, పరిపాలనా సామర్థ్యం మరియు నిరంతర అభివృద్ధిని ప్రతిబింబిస్తుంది.ఈ విషయాన్ని సీకాం డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ టి. ప్రణీత్ స్వరూప్ అధికారికంగా తెలియజేశారు

## పశు వైద్య కళాశాల క్విజ్ పోటీలో ప్రథమ బహుమతి



**తిరుపతి విద్య,డిసెంబర్ 16 ప్రభాత వార్త** పశు వైద్య కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థిని పల్లవి ఇటీవల విర్బక్ ఫార్మా కంపెనీ వారు నిర్వహించిన జోనల్ స్థాయి క్విజ్పోటీలో పాల్గొని ప్రథమ బహుమతి సాధించారు.విర్బక్ ఫార్మ ప్రతి సంవత్సరం జాతీయ స్థాయి లో బిడ్డింగ్ వెట్స్ అనే ప్రోగ్రాం యువ పశు వైద్యులను ప్రోత్సహించడానికి నిర్వహి స్తున్నది. జోనల్ స్థాయి లో తమిళనాడు,కర్ణాటక ,తెలంగాణ ,కేరళ రాష్ట్రాల పశు విద్య విద్యార్థులు ఆన్ లైన్ విధానం లో పాల్గొన్నారు. ఈ సందర్బంగా విర్బక్ ఫార్మా కంపెనీ ప్రతినిధులుకళాశాలకు విచ్చేసి ఆమెకు బహుమతి ని ప్రశంసా పత్రాన్ని అందించారు.ఈ సందర్బంగా కళాశాల అసొసియేట్డీన్ జగపతి రామయ్య ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.ఓ ఎస్ ఏ వినోద్ కుమార్,క్లినికల్ కాంప్లెక్స్ ప్రొఫెసర్ ధనలక్షి మ్మ పాల్గొన్నాను.

## రుణాలు చెల్లిస్తే మరింతగా సాయం




**వడమాలపేట, డిసెంబరు 16 ప్రభాతవార్త:** డ్వాక్రా మహిళలు, రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే అలాంటి వారికి మరింతగా సాయం అందించడానికి బ్యాంకులు ఇసద్ధంగా ఉన్నాయని వడమాలపేట ఎస్‌బీఐ శాఖ చీఫ్‌మేనేజర్ దేవప్రసాద్ తెలిపారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో మహిళలు, రైతుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళా సభ్యులకు రుణాలు అందించడంలో ఎస్‌బీఐ ముందంజలో ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హామీ మేరకు మహిళా సంఘాలను ప్రోత్సహిస్తూ, అదనంగా వ్యాపార పరంగా కూడా రుణాలు అందజేస్తామని తెలిపారు. సంఘమిత్ర సభ్యులు మహిళా సంఘాలను ప్రోత్సహించాలన్నారు. ఆర్థికంగా సభ్యులు, బ్యాంకులు పురోగతి సాధించేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో వడమాలపేట ఎస్‌బీఐ మేనేజర్ రవికుమార్, మండల వ్యవసాయాధికారి విజయకుమార్, వెలుగు సీసీ జయ, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



**విజయపురం, డిసెంబరు 16 ప్రభాతవార్త:** చదువుకునే వయసులో చదువు మీద మాత్రమే ఏకాగ్రత కలిగి ఉండాలని, ఇతర ఆకర్షణలకు లోనైతే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేరని, బాల్య వివాహాలు చేసుకుంటే అనారోగ్య సమస్యలు వస్తాయని సీడీపీవో ఇందిరాప్రియదర్శిని అన్నారు. వంద రోజుల జాతీయ ప్రచారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పన్నూరు ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండకుండా ఆడ పిల్లలు ఎవరు వివాహం చేసుకోకూడదని ఆమె తెలిపారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు బాల్య వివాహాలపై అవగాహన ఇవ్వాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే స్థానిక అంగన్‌వాడీ, ఏఎన్ఎం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్యామల, లక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## మంత్రిని కలసిన శాసనసభ్యుడు: శివయ్య ప్రసాదాల అందజేత



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 16 ప్రభాతవార్త**శ్రీకాళహస్తి శాసనస భ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని కలసి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదా లను అందించారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు నరసిం హాయాదవ్ ఉన్నారు.ఈ సంద ర్భం గా శాసనసభ్యుడు నియో జకవర్గంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు.నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పాఠశాలల పరిస్థితి ఆందోళన కరంగా ఉందని ఈ ఏడాది వర్షాలకు చాలా ఇబ్బందులు పద్దమన్నారు. పాఠశాల మరమ్మత్తులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. కాగా కాసాతోటలో బాలికల గురుకుల జూనియర్ కళాశాల ఉందని ఇక్కడ విద్యార్థులు అత్యధికంగా ప్రాధాన్యత ఇచ్చి చేరుతున్నారని అయితే ఇక్కడ విద్యార్థులు పరిమిత సంఖ్యలోనే అనుమతిస్తున్నారని భవనాలను పెంచుకొనుటకు అవకాశం ఉందని కాబట్టి విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరారు. కాగా ఈ గురుకులానికి ప్రహరి లేక, మురుగునీటి కాలువలు సక్రమంగా లేక విద్యార్థులు అనారోగ్యం పాలౌతున్నారని ఇందుకు ప్రత్యేక నిధులు కావాలని కోరారు. హాస్టల్ విద్యార్థులకు అన్నా క్యాంటిన్ నుంచి క్వాలిటి ఫుడ్ అందించుటకు సంబంధించి చర్చించారు.

***ముఖ్యమంత్రి ప్రశంస:*** ఈ సందర్బంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును కలసి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించినట్లు తెలిసింది. ఆలయాభివృద్ది,నిర్వహణకు సంబంధించి ముఖ్యమంత్రి అభినందించినట్లు తెలిసింది. కాగా నియోజకవర్గంలో ఎపెండింగ్‌లో ఉన్న 'ముఖ్యమంత్రి సహాయ నిధి సహాయాన్ని' త్వరగా విడుదల చేయాలని కోరినట్లు తెలిసింది.

# తిరుపతి డివిజన్

## కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో ధనుర్మాస గంట ప్రారంభం

**నారాయణవనం, డిసెంబర్ 16 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ది చెందిన టిటిడి అనుబంధ ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం 1.23 గంటల నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభమైనది. ఇకపై బుధవారం నుంచి ప్రతిరోజు ఉదయం 6నుంచి7గంటల వరకు సర్వదర్శనం వుంటుందని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. అలాగే ఉదయం 9-11, మధ్యాహ్నం 12-5.30 గంటల వరకు సర్వదర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. శుక్రవారం మాత్రం 10.30-5.30 వరకు సర్వదర్శనం వుంటుందన్నారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవలకు బదులు తిరుప్పావై ప్రవచనం జరుగుతుందన్నారు. ఆలయంలో ఈ నెల 30వతేదీ వైకుంఠ ఏకాదశి, 31వ తేది ద్వాదశి, జనవరి 1వ తేది కొత్త సంవత్సరం ఏర్పాటు చేస్తున్నారు.

## టిటిడి ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశికి శరవేగంగా సాగుతున్న ఏర్పాట్లు



**నారాయణవనం, డిసెంబర్ 16 ప్రభాతవార్త :** నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన టిటిడి ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో ఈ నెల 30,31వ తేదీల్లో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి కార్యక్రమంను అందరి సహకారంతో విజయవంతం చేయడం కోసం టిటిడి అధికారులు శరవేగంగా ఏర్పాట్లను చేపడుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనం ఏర్పాటు కల్పించడంతో పాటు విఐపిలకు కేటాయించిన సమయంలో వారికి కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించాలన్న ఉద్దేశ్యంతో సాధారణ క్యూ లైన్‌తో పాటు ప్రత్యేక క్యూ లైన్‌ని ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఆలయం లోపల, మాడవీధి చుట్టు రంగుల ముగ్గలను వేస్తున్నారు. దగ్గరలో విద్యుత్ దీపాలకరణ చేయడం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

## ముంపు బాధితులకు ఉపాధ్యాయుల భరోసా

**కేవీబీ పురం, డిసెంబరు 16 ప్రభాతవార్త:** మండలంలోని పాతపాళెం దళితవాడలో నవంబరులో సంభవించిన వరద ముంపుకు గురైన కుటుంబాలకు ఉపాధ్యాయులు ఆదరణగా నిలిచారు. ముంపుతో ఇళ్ళలోని సామగ్రి పూర్తిగా నష్టపోయిన నేపథ్యంలో 22 కుటుంబాలకు ప్రతి కుటుంబానికి ఒక కుక్కర్, ఒక స్టీల్ బిందెను కేవీబీ పురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం వితరణగా అందించింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ముంపు ప్రాంతంలో ఇళ్ళను స్వయంగా పరిశీలించి బాధిత కుటుంబాల కష్టాలను ప్రత్యక్షంగా చూశామని తెలిపారు. ఉపాధ్యాయుల సహకారంతో ప్రతి కుటుంబానికి సుమారు రూ.1500 విలువ చేసే కుక్కర్, స్టీల్ బిందెను అందించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్య సుబ్రహ్మణ్యం, ప్రకాష్, రజిత, అనిత, భువన్, విజయభాస్కర్, నాగరాజు, మునిహరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పథకం రద్దు దారుణం



**పుత్తూరు రూరల్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నిన్న పార్లమెంట్‌లో గ్రామీణ ఉపాధిహామీ పథకం రద్దుచేస్తూ పెట్టిన బిల్లును ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పుత్తూరు అంబేద్కర్ కూడలివద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ నాడు కమ్యూనిస్టు, కాంగ్రెస్ యూపీఏ ప్రభుత్వంలో వలస కూలీల నివారణ కొరకు జాతిపిత అయిన మహాత్మ గాంధీపేరుతో గ్రామీణ ఉపాధిహామీ పథకంగా చట్టం చేసికూలీలకు సంత్సరానికి వంద రోజులు కల్పించేందుకు చట్టం చేసి తగిన బడ్జెట్‌ని కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం మహాత్మగాంధీని ఒక వైపు పొగుడుతూ మరో వైపు ఆయన పేరుతో ఉన్న పథకాన్ని పూర్తిగా రద్దు చేసి మరో కొత్త పథకాన్ని తీసుకురావడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మునిశంకర్, రాజేష్, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, చిన్నబ్బ, నరసింహులు, రమేష్, ఆటో యూనియన్ నాయకులు విజయ్, దళిత గిరిజన సంఘం నాయకుడు నందయ్య పాల్గొన్నారు.

## నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించే లక్ష్యంతో విలేజ్ హెల్త్ క్లినిక్

**పుత్తూరు రూరల్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నగరి నియోజకవర్గంలో స్థానిక ప్రజలకు విలేజ్ హెల్త్ క్లినిక్, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ నిర్మాణాలు కోసం నిధులు మంజూరు చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రభుత్వంకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గంకు మంజూరైన 30 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 3 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ మంజూరు చేసి రూ.7.246 కోట్లు నిధులు మంజూరైనట్లు మంజూరైన వివరాలతో ఎమ్మెల్యేకి లేఖను పంపడం జరిగిందన్నారు. నగరి నియోజకవర్గంకు 30 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 3 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## హెల్మెట్ లేకుంటే భారీ జరిమానా



**సత్యవేడు, డిసెంబరు 16 ప్రభాతవార్త:** హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపే వారికి భారీ హెచ్చరికలు తెలుపుతూ జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఎస్ఐ లావణ్య పేర్కొన్నారు. హెల్మెట్ వాడుదాం...సురక్షితంగా ప్రయాణిద్దాం సత్యవేడును ప్రమాద రహిత ప్రాంతంగా గుర్తించడానికి సహకరిద్దాం అనే నినాదాలతో మంగళవారం పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇక నుంచి సత్యవేడు పరిధిలో హెల్మెట్ లేకుండా ద్విచక్రవా హనాలు నడిపితే వెయ్యి రూపాయల వరకు అపరాధంగా చెల్లించాల్సి ఉంటుందని ఎస్ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మార్కండయ్య, హెడ్‌కానిస్టేబుల్ బుజ్జి బాబు, ఈశ్వర్‌రెడ్డి, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలు దహనం .. నిందితుడు అరెస్ట్

### నిందితుడిపై పలు స్టేషన్లలో క్రిమినల్ కేసులు



**చంద్రగిరి, డిశంబర్ 16 ప్రభాతవార్త:** తొండవాడలో రెండు ద్విచక్ర వాహనాలను దహనం చేసిన నిందితుడిన మంగళవారం అరెస్ట్ చేసినట్లు సిఐ సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పిచ్చినాయుడు పల్లి (పంచాయతీ) హరిజన వాడకు చెందిన రేణిగుంట గౌతంబాబు అలియాస్ పెప్సీ (25) ఈ నెల 14న తొండవాడలో ఒక చిల్లర దుకాణం వద్ద మద్యం మత్తులో మహిళలతో ఘర్షణకు పాల్పడి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటన నేపథ్యంలో నిందితుడు తీవ్రమైన ఆగ్రహంతో 15న వేకువజామున అంగడి యజమాని కాంపౌండ్‌లోనికి ప్రవేశించి అక్కడే వున్న రెండు ద్విచక్ర వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టాడు. ఈ క్రమంలో యజమాని కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని గాలించే క్రమంలో మంగళవారం మల్లయ్యపల్లి రోడ్డులో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడిపై ఇప్పటికే గూడూరు 1 టవున్, ఎంఆర్ పల్లి, చంద్రగిరి పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదైవున్నట్లు తెలిపారు.

## దోమకాటుతో చిన్నారికి అస్వస్థత



**చంద్రగిరి, డిశంబర్ 16 ప్రభాతవార్త:** దోమకాటుకు గురైన చిన్నారి అస్వస్థతతో బాధపడుతున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ తెలిపారు. తొండవాడకు చెందిన ఉజ్వల శ్రీ చిన్నారి స్క్రబ్ టైఫస్ అనగా చిగ్గర్‌మైట్ (చిన్న నల్లి) కాటు వలన వ్యాపించే బ్యాక్టీరియా కారణంగా ఇన్‌ఫెక్షన్, జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, దద్దుర్లుతో బాలిక బాధపడుతున్నట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే సబ్ యూనిట్ ఆఫీసర్ శివయ్య, సూపర్‌వైజర్ వాసుదేవరెడ్డి గ్రామానికి చేరుకుని ఇంటింటికీ వెళ్ళి జ్వరాలపై సర్వే నిర్వహించి, వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధులు, యాంటీ లార్వాపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు గ్రామంలో బ్లీచింగ్ చేయించారు. ఈ క్రమంలో నివాసాల నడుమ నిల్వ వున్న నీటిని శుభ్రం చేయించారు. ఏఎన్ఎం లక్ష్మీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఎస్వీయూ ఫిజిక్స్ విభాగంలో కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమం



**తిరుపతి విద్య,డిసెంబర్ 16 ప్రభాతవార్త** శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో ల్యాబ్ మెటీరియల్ నిర్వహణపై వారం రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైన విషయం తెలిసింది ఇందులో భాగంగా మంగళవారం పలువురు నిపుణులు ల్యాబ్ పరికరాల నిర్వహణ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ప్రత్యేకించి మైక్రోస్కోప్, సెంటర్ ఫ్యూజ్, ఎలక్ట్రానిక్ మైక్రోస్కోపీ, వెస్ట్రన్ బ్లాటిన్, స్పెక్, అనలిటికల్ అనాలసిస్, పి సి ఆర్, హెచ్ పి ఎల్ సీ, జిసిఎంఎస్ తదితర పరికరాలపై నిపుణులు సునీత బత్రా, మినరల్ తమన్కర్, సరిత తోప్టే, సుధీర్ కుమార్, గోవిందు చిట్టే, మైలైన్డ్ షిడ్రక్, స్వప్నిల్ జాదవ్ తదితరులు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ బి. దేవ ప్రసాదరాజు పర్యవేక్షి ంచారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి :ఎంపీపీ



బాలాయపల్లి, డిసెంబర్ 16 ప్రభాతవార్త: గ్రామాల్లో ఉన్న భూ సమస్యలను సత్వర పరిష్కరించాలని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్త్రీ శక్తి కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. భూ సమస్యలతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దేవుని అధికారులు గ్రామాల్లోకి వెళ్లి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ముందుగా అన్ని శాఖల అధికారులతో శాఖలపై ఎంపీపీ సమీక్షించారు. 700 పొదుపు గ్రూపులకు 1700 కోట్ల రూపాయలు రుణాలు ఈ వార్షిక సంవత్సరంలో ఇచ్చినట్లు ఎపిఎం వై.కిరణ్ తెలిపారు. ఎవరైనా ఆక్వా రైతులు సాగు చేసుకోవాలనుకుంటే వారికీ అవగాహనా కల్పించి, నాలుగు లక్షల రూపాయల సబ్సిడీ ఇస్తామని తెలిపారు. శీతాకాలం రీత్య సీజనల్ వ్యాధులు శోకకుండా డయేరియా, వైరల్ జ్వరాలు సోకకుండా గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపరచాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో భూ సమస్యలు, వివాదాలు అధికంగా ఉన్నాయని రెవిన్యూ వ్యవస్థ ఏం చేస్తుందని తహసిల్దార్ ని ప్రశ్నించారు. ఊట్లపల్లిలో రెండు వర్గాల మధ్య భూ సర్వే వివాదం, జయంపులో దారి విషయమై మరో వివాదం జరుగుతుందన్నారు. ఇంకా పలు సమస్యలు ఉన్నాయని అన్నింటిని పరిష్కరించాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. పాఠశాలలో హాస్టల్స్ తనిఖీలు చేస్తున్నారా లేదా అని ఎంఈఓ నాగేశ్వరరావును ప్రశ్నించారు. పరిశుభ్రత, భోజనాలు మెరుగుపరచాలని ఆయన తెలిపారు.

బాలాయపల్లిలో గత పది రోజుల నుంచి త్రాగునీరు కలుషితం గా వస్తుందని దీంతో అంటు రోగాలు ప్రభలుతున్నాయని దీనిపై చర్యలు తీసుకో వాలని ఆర్డబ్ల్యూఎస్ హేమంతును ఆదేశించారు. సుబ్రహ్మ ణ్యం చెరువులో త్రాగునీరు కలసి వస్తుందున కలుషితనీరు వస్తుందని ఆయన తెలిపారు. ఇటీవల వచ్చిన తుఫానుకు నిమ్మ, మామిడి, అరటి పంటలు దెబ్బతిన్నాయని వాటికి నష్టపరిహారం ఇవ్వాలని పాకపూడి సర్పంచి మల్లెమాల గోపికృష్ణారెడ్డి సభ తీసుకుని వచ్చారు. ఉద్యానవన శాఖ అధికారి ఆనందరెడ్డి మాట్లాడుతూ ఫోటోలు, సరైన ధ్రువపత్రాలు అందజేస్తే నష్టపరిహారం ఇస్తామని తెలిపారు. జయంపు అలిమిలి మార్గమధ్యంలో ఆర్ అండ్ బి రోడ్డు మార్జిన్‌ను కొంతమంది అనుమతులు లేకుండా తవ్వుతున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బి ఏఈ బాబును ఆదేశించారు. రూ. ఒక కోటి 95 లక్షలతో మూడు రోడ్ల పనులకు ప్రతిపాదనలు పంపామని బాబు తెలిపారు. రూ.36 లక్షలతో కల్వర్ట్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో నారాయణ, ఎంఈఓ నాగేశ్వరరావు, ఏపిఎం కిరణ్, ఏపిఓ జ్యోతి, ఎంపీటీసీలు ఎం. సుజాత, రామయ్య, చంద్రమౌళి, వీళ్ళ సురేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ బట్టేపాటి మురళీ మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ వాన పార్వతి, కోఆప్షన్ సభ్యులు షేక్ ఆఫీస్ ఉద్దీన్, వైద్యాధికారులు లిఖిత, వెంకటరెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పేద విద్యార్థులు బట్టలు పంపిణీ చేసిన రోటరీ క్లబ్



నాయుడుపేట టౌన్, డిసెంబర్ 16 ప్రభాతవార్త: నాయుడుపేట రోటరీ క్లబ్ అమ్మ ఫౌండేషన్ సంయుక్తంగా నాయుడుపేటలోని ఎల్ఐ సాగరం వెస్ట్ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు బట్టలు పంపిణీ చేసారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నాగూరయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు స్కూల్ యూనిఫామ్‌గా ప్రభుత్వం ఇచ్చిన బట్టలు రోజువారీగా వాడుకుంటూ కొంత కాలానికి చినిగిపోతున్నాయి దాని దృష్టిలో ఉంచుకొని ఈ బట్టలు ఇవ్వటం జరిగిందన్నారు. ఎంఈఓ సూచిస్తూ మిగతా విద్యాలయ అధికారులు అందరూ మాట్లాడుకుని ఎక్కడైతే పేద విద్యార్థులు ఉన్నారో వారిని గుర్తించి మా దృష్టికి తీసుకువస్తే వారందరికీ బట్టలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. తాము ఇచ్చే ఈ బట్టలు కేవలం రోజు వారికి మాత్రమే ఇది స్కూల్ యూనిఫామ్ కాదని దీనిని గమనించాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి మునిరత్నం, క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు మీనా కుమారి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నాగూరయ్య, కార్యదర్శి బట్ట సుబ్రహ్మణ్యం, అమ్మ ఫౌండేషన్ ఫౌండర్ కృష్ణవేణి, రోటరీ సభ్యులు చంద్రశేఖర్, రామ్మోహన్, కె వి ప్రసాద్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## అంధుల జూడో పోటీలకు 22 మంది ఎంపిక



వెంకటగిరి, డిసెంబర్ 16 ప్రభాతవార్త: బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అంధుల జూడో క్రీడాకారులు మరో జాతీయ పోటీలకు సిద్ధమయ్యారు. రాజస్థాన్‌లో జరగనున్న 14వ జాతీయ అంధుల జూడో ఛాంపియన్‌షిప్‌కు ఆంధ్రప్రదేశ్ తరపున మొత్తం 22 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొననున్నారని రాష్ట్ర బ్లైండ్స్ సపోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పరుచూరి పెంచల నర్సయ్య తెలిపారు. పోటీలకు వెళ్లే క్రీడాకారులకు అవసరమైన యూనిఫామ్‌ను తిరుపతి జిల్లా క్రీడల అధికారి కార్యాలయంలో బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు అందజేశారు.

## వృద్ధులకు ఫల సరుకులు పంపిణీ



గూడూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త: పట్టణం లోని లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, టౌన్ వెస్ట్ క్లబ్స్ సేవా కార్యక్రమాలలో భాగంగా ప్రతి నెల ఇచ్చే విధంగా పేద వృద్ధులుకి ఫల సరుకులను పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పర్మినెంట్ ప్రాజెక్ట్ చైర్మన్ ఎంజెఫ్ లయన్ వి.చంద్ర శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పేర్మినెంట్ ప్రాజెక్ట్ కి మరికొంత ఫండ్‌ని సేకరించి ఇంకొంత మందికి కూడా ఫల సరుకులను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సుధాకర్, మురళి కృష్ణ, గోపినాథ్‌రెడ్డి, పి.ప్రసాద్, ఆర్.రవీంద్రరెడ్డి, యం.మురళిరాజు, ఎస్.ఎల్.ఎన్.స్వామి, వెంకట సుబ్బయ్య, హరికృష్ణ, కావేరి, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు దుస్తులు పంపిణీ



గూడూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త: పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ధనుర్మాసం ఆరంభం, నెల ప్రారంభం సందర్భంగా గాంధీనగర్ గిరిజన కాలనీ నందు నిరుపేదలైన 20 దుస్తులు, మహిళలకు చీరలు 30 మందికి పంపిణీ చేయడం జరిగింది. అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ధనుర్మాస ప్రారంభం సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు వీఎంసి నెంబర్ వెంకటేశ్వరరావు, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ దయాకర్, కెఆర్‌ఎం, శ్రీనివాసులు, సతీష్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ చైర్మన్‌కి ఘన సన్మానం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరుజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎంపికైన రెడ్డివారి గురవారెడ్డిని మంగళవారం మార్కెటింగ్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్యానాయుడు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడి పనిచేసే గురవారెడ్డిని పదవి రావడం చాలా ఆనందంగా వుందని, కేక్ కోసి, దుశాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు అంక్షితల కృష్ణయాదవ్, కాసరం రమేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, మాజీ కౌన్సిల్ బషీర్, ఏరియా కమిటీ సభ్యులు వినయ్, క్రిష్ణమనాయుడు, సన్నిడియోల్, రామకృష్ణ, సుజిత్ రాజేష్, బాలాజీ, సలీం, కంఠా సుబ్బు, రాకేష్‌బాబు రెడ్డి, జైసారధి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో....**

## అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



పుత్తూరు రూరల్, డిసెంబరు 16 ప్రభాత వార్త: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజిమాధవయ్య ఆధ్వర్యంలో పుత్తూరు మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గోపాలకృష్ణాపురం గ్రామ పంచాయతీలో జడ్పీ నిధులు 5 లక్షలతో బోరు, మోటారు, పైపులైన్, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. జడ్పీ నిధులతో గ్రామ ప్రజలకు తాగునీటి బోరు వేయడానికి భూమిపూజ కార్యక్రమం ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్‌కుమార్, మాజీ సర్పంచ్ హేమ, హరి గోపాల్, జేసీబీ చిన్న, సుబ్బు, మోహన్, రామయ్య, గోవర్ధన్, మునిలక్ష్మి, రామ్ తులసి, వెంకటరత్నం, భారతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రికెట్ ఫైనల్‌లో పుత్తూరు మండలం అద్భుత విజయం

పుత్తూరు రూరల్, డిసెంబరు 16 ప్రభాతవార్త: తిరుపతి డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల్లో పుత్తూరు మండలం జట్టు అద్భుత ప్రతిభను ప్రదర్శించి విజేతగా నిలిచింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో చంద్రగిరి మండలంపై 8 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి డివిజనల్ టైటిల్‌ని కైవసం చేసుకుంది.

## చదరంగంలో కాన్పూర్ ముందడుగు




శ్రీకాళహస్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త: తిరుపతి ఐఐటిలో జరుగుతున్న 58వ ఐఐటి స్పోర్ట్స్ మీట్‌లో యువ క్రీడాకారులు విజయానికి పరుగులు తీస్తున్నారు. తమ ప్రతిభను చాటి తమ సంస్థకు మంచిపేరు తీసుకురావటానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తు న్నారు. మంగళవారం జరిగిన పోటీల్లో చదరంగంలో కాన్పూర్ ముంద డుగు లో ఉండగా వెయిట్ లిఫ్టింగ్ రూర్కి, కాన్పూర్, బిహెచ్‌యులు తమ సత్తా చాటారు. చెన్నై, హైదరాబాదు ఐఐటిల సహకారంతో 58వ ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్ నిర్వహించుటకు నిర్ణయించారు. ఈ నెల 21 వరకు జరిగే పోటీల్లో ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. మూడో రోజు మంగళవారం చెస్, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్‌లలో ఉత్కంఠభరితమైన పోటీ చోటు చేసుకుంది. వివిధ ఐఐటిల నుంచి వచ్చిన విద్యార్థులు అథ్లెట్లు వివిధ విభాగాల్లో కీర్తి కోసం పోటీ పడుతున్నారు.

**చదరంగంలో ఉత్కంఠ పోటీ:**

చదరంగ పోటీల్లో విద్యార్థులు డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణతో పోటీ పడ్డారు. ఈ పోటీల్లో కాన్పూర్ విద్యార్థులు రెండవ రౌండ్స్ తరువాత కాన్పూర్ 8 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా ఖరగ్‌పూర్ విద్యార్థులు 7.5 పాయింట్లలతో పోటీ పడుతుంది. ఐఐటి బిహెచ్‌యు వారణాసి, హైదరాబాద్ 6పాయింట్లతో మూడో స్థానంలో నిలిచారు. చెస్ మ్యాచ్‌లు వ్యూహాత్మక ప్రతిభతో ఏకాగ్రతతో గుర్తించబడుతున్నాయి. రాబోయే పోటీ ముగింపుకు వేదికకు సిద్ధమౌతుంది. టెన్నిస్ మ్యాచ్‌లు లీగ్ దశ దాటలేదని నిర్వాహకులు వివరించారు. నాకౌట్ దశకు చేరుకోవటం కోసం కీలక పాయింట్లు కోసం జట్లు పోరాడుతున్నాయి. వెయిట్ లిఫ్టింగ్‌లో రూర్కి, కాన్పూర్ బిహెచ్‌యు ఫైన్ వెయిట్ లిఫ్టింగ్ రోజుల్లోని కొన్ని అత్యంత నాటకీయ క్షణాలను అందించిందని చెప్పవచ్చు.

## కారులో చెలరేగిన మంటలు



నాయుడుపేట రూరల్, డిసెంబర్ 16 ప్రభాతవార్త: మండలంలోని నరసారెడ్డికండ్రిగ గ్రామానికి వెళ్లే రహదారిలో నిలిపి ఉన్న ఓ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. అరవపెరిమిడి గ్రామానికి చెందిన హరిబాబు అనే వ్యక్తికి చెందిన కారుగా గుర్తించారు. కారు నిలిపి ఉండటంతో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

## కోట ఎంపిపి దాసరి అంజమ్మ మృతి



కోట, డిసెంబర్ 16 ప్రభాతవార్త: మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు దాసరి అంజమ్మ (65) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె అనారోగ్యంతో తిరుపతిలో వైద్య చికిత్సలు పొందారు. అక్కడ మృతి చెందడంతో భౌతికకాయాన్ని మండల పరిధిలోని ఊనుగుంటపాలెం గ్రామానికి తీసుకొచ్చారు. ఈమె తొలిసారిగా వైసీపీ నాయకులు కొడవలూరు ధనంజయరెడ్డి బలపరిచిన ఎంపిపిగా గెలిచారు. ఆమె మృతి పట్ల వైసీపీ నాయకులు కొడవలూరు ధనంజయరెడ్డి ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, కోటారెడ్డి, నాగూర్ యాదవ్, శివరామనాయుడు, పుట్టా నారాయణ తదితరులు అంజమ్మ మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు.

## విద్యతో పాటు ఆటలు పాటలకు ప్రాధాన్యం



శ్రీసిటీ, డిసెంబర్ 16 ప్రభాతవార్త: విద్యాభ్యాసంలో మొదటి మెట్టు అంగన్వాడీ కేంద్రాల ద్వారా మొదలవుతుందని అంగన్వాడీ కేంద్రాలలో ఆటలు పాటలతో కూడిన విద్యను అందించాలని సిఐఐ ఫౌండేషన్, బ్లూస్టార్ ప్రతినిధులు తెలియజేశారు తడ మండల అంగన్వాడీ కేంద్రాల టీచర్లకు సహాయకులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సిఐఐ ఫౌండేషన్, బ్లూ స్టార్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించారు. సిఐఐ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ చిన్న యుస్సెన్, యుక్తి, బ్లూ స్టార్ యాజమాన్యం సిడిపిఓ జ్యోతి కిరణ్ సూపర్వైజర్ లక్ష్మీ నారాయణమ్మ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడి విత్తనాలు పంపిణీ



కోట, డిసెంబర్ 16 ప్రభాతవార్త: మండలంలోని ఊనుగుంటపాళెం గ్రామంలో రైతు సేవా కేంద్రంలో మంగళవారం వాకాడు ఎఎంసి చైర్మెన్ దార ప్రమీల, కోట మండల తెదేపా అధ్యక్షులు పలగాటి భాస్కర్‌రెడ్డి రైతులకు సబ్సిడి వరి విత్తనాలను పంపిణీ చేశారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దిత్వా తుపాన్ కారణంగా వరి పంట నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీపై ప్రభుత్వం కేఎన్ఎం.1638 వరివిత్తనాలను పంపిణి చేయడం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు రైతుల సంక్షేమ కోరకు పాటు పడుతుందన్నారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు పరచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షులు దూవ్వూరు శ్రీధర్ రెడ్డి, ఎంపిటిసి డి.సురేష్, పలగాటి జితేంద్రరెడ్డి, వసంత్ కుమార్ రెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, పోలయ్య, వ్యవసాయాధికారి సుచ్చంద్ర ప్రసాద్ ,సాయి, మనోహర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అక్వేరియా రంగు చేపలు పెంపకంపై శిక్షణ



దొరవారిసత్రం, డిసెంబర్ 16 ప్రభాతవార్త: మండలం వెలుగు కార్యాలయంలో రంగు చేపల పెంపకంపై మత్స్యశాఖ, జీసిఎఫ్ ప్రాజెక్ట్ సహకారంతో సీసీలకు విఓఏ, ఎస్‌హెచ్‌జి సభ్యులకు ఏపి ఎం ముని రాజా ఆధర్యంలో ఒకరోజు శిక్షణ ఇవ్వడం జరిగింది భారతదేశ తీర ప్రాంత వాసుల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు అధికమించి సామర్థ్యాన్ని పెంపొందించడమే ముఖ్య ఉద్దేశం జీసిఎఫ్ సెర్ప్ సమన్వయం ద్వారా 100 గ్యారెంటీ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో సమయుక్తంగా రంగు చేపల పెంపకంపై శిక్షణ తయారీ ఆక్వేరియం తయారీ పెంపకం, మార్కెటింగ్‌పై సంపూర్ణ అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ గోపాల్ రెడ్డి, ఎంపీడీవో గోవర్ధన్, మత్స్య శాఖ ఏడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకంపై గ్రామస్తుల నిరసన



వెంకటగిరి, డిసెంబర్ 16 ప్రభావతవార్త: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించడం లేదని వెంకటగిరి మండల కలవలపూడి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వ్యవహారంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడం లేదని తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. భోజనంలో అన్నం, కూరలు, గుడ్లు సరైన విధంగా సప్లై చేయడం లేదని చెప్పారు. గతంలోను టీచర్స్ ముందే బియ్యాన్ని దొంగలిస్తూ ఉంటే ప్రత్యక్షముగా పట్టుబడినా అధికారులు పట్టించుకోలేదన్నారు. అధికారులు చోద్యం చూస్తున్నరని తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లల తల్లిదండ్రుల ఫిర్యాదులను స్వీకరించిన పాఠశాల చైర్మన్ దట్టం బాలసుబ్రమణ్యం కమిటీ సభ్యులతో కలిసి హెచ్ఎం, ఎంఈఓ వద్ద పలు మార్లు వినతిపత్రాలు సమర్పించారు. అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తులు చివరికి ఎమ్మెల్యే రామకృష్ణకు ఫిర్యాదు చేశారు.

## రైతులకు మద్దతు ధర కల్పించాలి ఎంపీ మద్దెల

వెంకటగిరి, డిసెంబర్ 16 ప్రభాతవార్త: రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని ఎంపీ మద్దెల గురుమూర్తి కోరారు. రైతులు ఎదుర్కొంటున్న తీవ్రమైన ధరల సంక్షోభంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ లోక్‌సభలో అడ్జర్న్‌మెంట్ మోషన్ నోటీసు ఇచ్చారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవడం, కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ లేకపోవడం వలన దేశవ్యాప్తంగా రైతులు తీవ్రమైన ఆర్థిక నష్టాలలోకి నెట్టబడుతున్నారని ఆయన తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంట ఉత్పత్తి ఖర్చు కంటే కనీసం 50 శాతం అధికంగా కనీస మద్దతు ధర ఇవ్వాలన్న హామీ ఇప్పటికీ అమలుకాలేదని ఆయన విమర్శించారు. రైతులను ఆదుకోవడానికి, వారి జీవనాధారాన్ని రక్షించడానికి స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర చట్టాన్ని వెంటనే తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డాక్టర్ మద్దిల గురుమూర్తి డిమాండ్ చేశారు.

## విజేతలకు బహుమతులు పంపిణీ



చిల్లకూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త: గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి చిల్లకూరు మండల స్థాయి పరీక్షలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. స్థానిక ఎల్‌పిపి స్కూల్ నందు కుడుముల వెంకట నారాయణ దాతృత్వంలో విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. జే.వి.వి. ఉపాధ్యక్షులు చెంచు నారాయణ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులలో మూఢనమ్మకాలు పోగొట్టేందుకు చెకుముకి సైన్ పరీక్షలు నిర్వహిస్తున్నామని విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన కల్పించి తద్వారా సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను పోగొట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, పురుషోత్తమరావు, చెంచు నారాయణ, సుబ్బారావు, ప్రభాకర్, ఆనంద్, శ్రీనివాసాచారి, ఎల్.ఏ.పి స్కూల్ హెచ్.ఎం సురేష్ ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అధ్వాన్నంగా బీడీ కాలనీ రోడ్డు

**ప్రతిపాదనలకే పరిమితమైన వైనం-భవిష్యత్ రద్దీ దృష్ట్యా తప్పని విస్తరణ**



చంద్రగిరి, డిశంబర్ 16 ప్రభాతవార్త: బీడీ కాలనీకి వెళ్ళే రోడ్డు అధ్వాన్నంగా తయారై వాహనచోదకులను ప్రమాదాల బారిన పడేస్తున్నది. సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం కాలనీల ఆవిర్భావ సమయంలో నిర్మించిన సిసి రోడ్డు ప్రస్తుతం గుంతలమయమై అవసాన దశకు చేరుకున్నది. స్థానిక పాతపేటలోని లైబ్రరీ నుండి బీడీ కాలనీ వరకు సుమారు 500 మీటర్ల దూరం కలిగిన ఈ రోడ్డులో అక్కగార్ల కాలనీ, వికలాంగుల కాలనీ, బీడీ కాలనీ, సప్తగిరి కాలనీలకు చెందిన వేలాధిగా గల దిగువ మధ్య తరగతి (సుమారు నాలుగు వేలకు పైగా) ప్రజలునిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్యాక్సీలతో పాటు కాలినడకన తిరుగుతుంటారు. రోడ్డు దుస్థితిపై ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి ఇప్పటికే రెండు పర్యాయాలు మండల సర్వ సభ్య సమావేశంలో సభకు వివరించారు. గత సమావేశంలో రోడ్డు నిర్మాణానికి అవసరమైన సుమారు రూ.45 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. దాదాపు 30 అడుగుల వెడల్పు కలిగిన ఈ మార్గంలో 3 మూడు మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించి వున్నారు. అయితే పెరిగిన జనాభా, వాహనాల రద్దీ దృష్ట్యా కాలువ నుండి కాలువ వరకు మధ్యన గల కనీసం 6 మీటర్ల వెడల్పుతో లైబ్రరీ వద్ద నుండి బీడి కాలనీ వరకు విస్తరించగలిగితే ఒక అందమైన మార్గంగా రూపొందగలదు. ఈ ప్రాంతంలో అభివృద్ధికి సంబంధించి ఒకరోజున ఎంఎల్‌ఏ పులివర్తి నాని మీటింగ్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు వివరించగలిగితే కేవలం నెల రోజుల్లోనే లక్ష్యాన్ని సాధించగలరు. ఆ మేరకు అధికార పక్షం చర్యలు తీసుకుంటుందని పార్టీలకతీతంగా ప్రజలు ఆశిస్తున్నారు.

## పొదుపుగా ఇంధన వనరుల వినియోగం

**- విద్యుత్ ఆదాపై అవగాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ సుమిత్‌కుమార్**



చిత్తూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త: సహజ ఇంధన వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరు కట్టమంచి వివేకానంద విగ్రహం నుండి ప్రారంభమైన విద్యుత్ ఆదాపై అవగాహన ర్యాలీని కలెక్టర్ సుమిత్‌కుమార్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తే ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. రాష్ట్రం ఇంధన పొదుపులో మంచి ఫలితాలు సాధిస్తోందన్నారు. జిల్లాలో 200 కిలోవాట్స్ ద్వారా పీఎం సూర్యమర పథకం ద్వారా నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. అందరం కలసి పనిచేస్తే విద్యుత్ పొదుపు ద్వారా 5 వేల మెగావాట్స్ పొదుపు చేసుకోవచ్చునన్నారు. ప్రభుత్వ భవనాల్లో పిఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ తయారు చేసి విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చునన్నారు. విద్యుత్ పొదుపుపై జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే సోలార్ ఇ రూఫ్ టాప్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలన్నారు. కట్టమంచి వివేకానంద విగ్రహం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ గాంధీ సర్కిల్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ ఆయూబ్‌ఖాన్, ట్రాన్స్‌కో ఎస్ఇ ఇస్మాయిల్, విద్యుత్ శాఖ అధికారులు మునిచంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం

**- ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్**

కుప ్పం, డిసెంబర్ 16 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పం ప్రాంతంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ధ్యేయమని ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కుప్పం మండలంకు త్వరలో రానున్న పరిశ్రమలకు సంబంధించి మండల సర్వేయర్, స్థానిక నేతలతో కలసి ఆయన స్థలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పానికి సాధ్యమైనన్ని అధిక సంఖ్యలో పరిశ్రమలు వచ్చేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కుప్పంలో పరిశ్రమల ఏర్పాటుకు గాను ప్రముఖ కంపెనీలతో చర్చలు సైతం జరుపుతున్నట్లు చెప్పారు. పారిశ్రామికవేత్తలు కూడా కుప్పంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్నారన్నారు. మండలాల్లో సిఎం చంద్రబాబు ఆదేశానుసారం పారిశ్రామిక వాడలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. తిరుపతి నగరం సమీపంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్‌ఎఫ్‌సి) నిర్మాణంకు జోనల్ మేనేజర్‌తో కలసి స్థలాన్ని పరిశీలించామన్నారు. తాజాగా సోమవారం చంద్రగిరి నియోజకవర్గం రామిరెడ్డిపల్లి ఎ ఎంఎస్ఎంఇ పార్కులో ఏరా ్పటైన పరిశ్రమలను పరిశీలించినట్లు తెలిపారు.

## మండలంలో ఉధృతంగా వరి నాట్లు

కేవీబీ పురం, డిసెంబరు 16 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నీటి ఆదరణ దొరకడంతో రైతులందరూ తమ పంట పొలాలను దుక్కులు చేసుకుని ఆనందోత్సాహాలతో ఉధృతంగా వరి నాట్లు వేసుకుంటున్నారు. మండ లంలో వర్షాలు కూడా నవంబర్, డిసెంబర్ నెలలో వర్షాలు బాగా పడతాయి. దీన్ని ఆసరాగా తీసుకుని రైతులు వరినాట్లు వేసుకుంటున్నారు. బోరు బావులలో, చెరువులలో కూడా నీరు బాగా నిండడం తో రైతులు వరి పంట బాగా వస్తుందని ఉద్దేశంతో వరినాట్లు వేసుకుంటున్నారు. సంబంధిత మండల వ్యవసాయశాఖ అధికారులు మండలంలో కనీసం 5,6 చోట్ల క్షేత్ర పర్యటనలతో చేసి వరి వంగడాలు బాగా అభివృద్ధి చెంది పంటలు అభివృద్ధిగా పండేందుకు వ్యవసాయ శాఖ అధికారులు వరి పంట సస్యశ్యామలం పొందడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పలు రైతులు కోరుతున్నారు. కాట్రపల్లి, కళత్తూరు, రాయపాడు, ఎస్ఎల్ పురం, రాజుల కండ్రిగ, పూడి, రంగయ్యగుంట, కల్లూరు, తిమ్మసముద్రం, కొత్తూరు, పవనవారి కండ్రిగ, తదితర గ్రామాల్లో రైతులు వరినాట్లు ఉధృతంగా నాటేస్తున్నారు. దీనిపైన వ్యవసాయశాఖ అధికారులు స్పందించాలని రైతాంగం కోరుతున్నారు.

## పద్మావతిపురం లో అభివృద్ధి పనులకు భూమిపూజ

**-స్మశానవాటిక, డ్రైనేజ్ పనులకు ఎమ్మెల్యే నాని భూమిపూజ**



తిరుపతిరూరల్, డిసెంబర్ 16 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం పద్మావతిపురం, శ్రీనివాసపురం గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడ చైర్మెన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి శంఖారావం పూరించారు. మంగళవారం పద్మావతిపురం, శ్రీనివాసపురం గ్రామ పంచాయతీలకు చెందిన స్మశానవాటికలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాని, తుడ చైర్మెన్ దివాకర్‌రెడ్డిలు భూమిపూజ చేసారు. తుడా నిధుల ద్వారా సుమారు రూ.13లక్షల 35వేల వ్యయంతో డ్రైనేజ్ కాలువ నిర్మాణపనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పనులతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడి, వర్షాకాలంలో నీటి నిల్వలు, దుర్వాసన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే నాని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో ఎక్కడా రాజీ పడకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగుతాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమిని నాయకులు గణపతినాయుడు, చిగురువాడ గ్రామ సర్పంచ్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, పద్మావతిపురం గ్రామ సర్పంచ్ జ్యోతి, శ్రీనివాసపురం కార్యదర్శి మాధవి మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.